

ఎలా బతకాలి..!



- 45 నెలలుగా జీతాల్లేవు.. ● బోరు మెకానిక్‌ల ఆకలి కేకలు
- రాష్ట్రవ్యాప్తంగా 400 మందికిపైగా.. ● 20 ఏళ్లుగా గ్రామాల్లో సేవలందిస్తున్న వైనం
- పట్టించుకోని జిల్లా పరిషత్ అధికారులు

నెలా కాదు.. రెండు నెలలు కాదు.. ఏకంగా 45 నెలల నుంచి వారికి జీతాలు ఇవ్వడం లేదు. అన్ని నెలలుగా జీతాలు లేకపోవడంతో వారి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఒకప్పుడు పల్లెల్లో చేతిపంపులు ఉండేవి. మండలానికి ఒకరు ఉండే బోరు మెకానిక్‌లకు మండల పరిషత్ నిధుల నుంచి జీతాలు చెల్లించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీరికి జీతాలు నిలిపివేశారు. జీతాల విషయమై వారు ఎమ్మెల్యే స్థాయి నుంచి ముఖ్యమంత్రి జగన్ వరకు విన్నవించినా ఆ ప్రభుత్వంలో ఎవరూ కనికరించలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి మాకు జీతాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఉన్న చేతిపంపు మెకానిక్‌లకు 45 నెలలుగా జీతాలు అందక ఆకలి కేకలు వేస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల బోర్లు వేసి పైపులైన్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. అయితే గతంలో అలాంటి పరిస్థితులు లేవు. ఏ గ్రామంలో చూసినా హ్యాండ్‌బోర్ (చేతిపంపు)లు మాత్రమే ఉండేవి. తాగునీటి సమస్య పరిష్కారం కోసం గ్రామాల్లో బోరు వేస్తే ఆ బోరుకు పైపులు ఏర్పాటు చేసి చేతిపంపును బిగించేవారు. ఆ చేతిపంపు ద్వారానే పల్లె ప్రజలు బిందెలతో నీటిని తీసుకెళ్లి వినియోగించుకునేవారు. ఆ చేతిపంపు చెడిపోతే వెంటనే గుర్తొచ్చేది గ్రామీణ ప్రాంతాల్లోని బోరు మెకానిక్‌లు. 20 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపులకు మరమ్మతులు చేస్తూ ప్రజలకు సకాలంలో తాగునీటిని అందిస్తూ సేవలు చేస్తున్న రాష్ట్రవ్యాప్తంగా 400 మందికిపైగా మెకానిక్‌లు కుటుంబాలు పోషణభారమై ఆక లి కేకలు వేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో బోరు మెకానిక్‌లకు జీతాలు ఇవ్వకపోడంతో సంవత్సరాల తరబడి జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి చేసేది లేక ఆశలు వదులుకున్నారు. నెలకు రూ. 7,700తో అతి తక్కువ జీతంతో పని చేస్తూ మండలంలో ఎక్కడ చేతిపంపు మరమ్మతులకు వచ్చినా పరుగుల మీద వెళ్లి ఎవరి సాయం లేకపోయినా ఒంటరిగా చేతిపంపులోని పైపులు బయటకు తీసి కొత్త పైపులు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తూ వస్తున్నారు. చేతిపంపుల మరమ్మతుల కోసం జిల్లాలో 20మందికిపైగా బోర్ మెకానిక్‌లు పనిచేస్తుండగా అందులో రాయచోటి నియోజకవర్గంలో లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాలకు రమణ, రామాపురం, రాయచోటి, చిన్నమండెం మండలాలకు సుబ్బరాయుడు, వీరబల్లి మండలానికి శ్రీనివాసులు, సుండుపల్లె మండలానికి రాజన్న, సంబేపల్లె మండలానికి సిద్దిరామయ్యలు పనిచేస్తున్నారు. వీరు మండలంలో ఎక్కడ చేతి పంపు మరమ్మతులకు గురైనా వెంటనే అక్కడికి సొంత ఖర్చులతో వెళ్లి వస్తున్నారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలోని జనరల్ ఫండ్ నుంచి ప్రతి నెలా జీతాలు చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జిల్లా పరిషత్ అధికారులు జీతాలు చెల్లించిన పరిస్థితులు ఉన్నాయి. అయితే జిల్లాలో మాత్రం బోరు మెకానిక్‌లు గత వైసీపీ ప్రభుత్వంలో జీతాలు రాక ఆకలితో అలమటిస్తున్నారు. జీతాలు ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, చివరికి ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా మా బాధలు అర్థం చేసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.



చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్ సుబ్బరాయుడు

జీతాలు ఇచ్చి మా కుటుంబాలను కాపాడండి..



గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపులకు మరమ్మతులు చేస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్న మాకు జీతాలు ఇచ్చి పుణ్యం కట్టుకోండి. గత ప్రభుత్వంలో అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి అలసిపోయాము. 45 నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారింది. అధికారుల చుట్టూ తిరిగి వినతిపత్రాలు ఇచ్చుకున్నా మా గోడు పట్టించుకునే వారు లేరు. కూటమి ప్రభుత్వంలో అయినా మా జీతాలు అందించి మా కుటుంబాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

- సుబ్బరాయుడు, బోర్ మెకానిక్, రాయచోటి

45నెలలుగా జీతాలు రాక అల్లాడుతున్నాం..



45 నెలలుగా జీతాలు రాక అల్లాడుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా పలుమార్లు అధికారులకు, నాయకులకు మా సమస్యను విన్నవించినా ఫలితం లేదు. అధికారులు కరుణిస్తారు, జీతాలు వస్తాయని నమ్ముకుని అప్పులు చేసి ఆకలి తీర్చుకుంటున్నాం. కొన్ని చోట్ల మండల పరిషత్ నిధుల నుంచి జీతాలు ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చేతిపంపులకు మరమ్మతులు చేస్తూ సేవ చేస్తున్న మా బాధను గుర్తించి సకాలంలో జీతాలు ఇచ్చి ఆదుకోండి.

- రమణ, చేతిపంపు బోర్ మెకానిక్, లక్కిరెడ్డిపల్లె

కాలువల పనులు వేగవంతంగా పూర్తి చేయండి

- ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకట్రమణరాజు



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకట్రమణరాజు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు ప్రాజెక్టు కాలువల పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకట్రమణరాజు తెలిపారు. గురువారం ఆయన ఈఈ సురేష్‌బాబు, ఏఈ సతీ ష్ కుమార్‌తో కలసి పెద్దేరు ప్రాజెక్టు కాలువ గేట్లు, కాలువల అభివృద్ధి ప నులు, ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన పార్కు, రోడ్లు తదితరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు, చేపడుతున్న కాలువల ఆధునికీకరణ పనుల గురించి ఏఈని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో సకాలంలో పూ ర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పెద్దేరు ప్రాజెక్టులో రోడ్ల దుస్థితి, గార్డెన్ మరమ్మతులు, ప్రాజెక్టు క్వార్టర్స్ మరమ్మతులు, పర్యాటకులకు బోటింగ్ సౌకర్యం తదితర విషయాలను ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్ ఎస్‌ఈకి వివరించారు. ఆయన వెంట కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉర్దూ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

- మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి కృషి చేస్తామని మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్ పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఉర్దూ విద్యాసంస్థలను సందర్శించారు. మొదట ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌రూము ఏర్పాటు చేయాలని కోరారు. ఉర్దూ పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేయాలన్నారు. 16 సంవత్సరాలుగా పనిచేస్తున్నా తమకు వేతనాలు పెంచడంలేదని అధ్యాపకులు తెలిపారు. అనంతరం ఆయన కొత్తకొట్టాలు, మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో వారి సమస్యలను తెలుసుకున్నారు. అమృతానగర్‌లో మైనార్టీ బాలబాలికల కోసం నిర్మించిన ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను పరిశీలించారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఎంఏ షరీఫ్ విమర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీలు విద్యతోపాటు ఇతర రంగాల్లో వెనుకబడ్డారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.500 కోట్లు సబ్సిడీ రుణాలను మంజూరు చేసిందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు చేతివృత్తులు, చిరువ్యాపారులకు రూ.5 లక్షల రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు సీఎం సురేశ్‌నాయుడు, వీఎస్ ముక్తియార్, టీడీపీ నాయకులు ఖలీల్, తాతయ్య, జనసేన నాయకుడు జిలానీబాష తదితరులు పాల్గొన్నారు.



కొత్తకొట్టాల ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

స్వర్ణాంధ్ర విజన్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి

- బయోగ్యాస్ ప్లాంట్లకు భూమిని గుర్తించాలి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా సున్నా పేదరికం పీ4 పాలసీకి నియోజకవర్గ స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి సున్నా పేదరికం-పీ4 విధానం, నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్రణాళికల తయారీ, కంప్రెస్ట్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటు కోసం భూముల గుర్తింపు, ఎంఎస్ఎంఈ సర్వే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్‌తో పాటు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ శనివారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో (పీ4 పాలసీపై) ప్రజలు స్టేక్ హోల్డర్స్ నుంచి ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఆ అభిప్రాయాలు అన్నింటినీ క్రోడీకరించి ఇంకా ఏదైనా మెరుగుపర్చాల్సిన అంశాలు ఉంటే చేర్చి ఉగాది నాడు స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక మొదటి సూత్రమైన సున్నా పేదరికం సాధనకు పీ4 పాలసీ అమలు చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు. జిల్లాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటు కోసం భూముల గుర్తింపు వేగవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పేదరికం నిర్మూలనకు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం ప్రతి మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించాలని సూచించారు. ఎంఎస్ఎంఈ సర్వే త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. వీసీలో డీఆర్వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, అధికారులు

ఉద్యానశాఖ పరిశోధన కేంద్రానికి మోక్షం

- భూములను పరిశీలించిన యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ మాధవి
- పూలు..కూరగాయల పరిశోధనలకు శ్రీకారం ● రూ.25 లక్షలతో 5 ఎకరాల్లో మొదటి విడతలో సాగు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీహిల్స్ దిగువన ఉన్న ఉద్యాన శాఖ పరిశోధనా కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. గురువారం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ సీనియర్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ మాధవి పరిశోధనా కేంద్రాన్ని, పరిశోధనల కోసం కేటాయించిన భూములను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె పంచాయతీ పరిధిలో ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఉపయోగకరమైన పూలు, కూరగాయల సాగులో పరిశోధనలు జరిపి నూతన వంగడాలు, అధిక దిగుబడి, ఆధునిక యాజమాన్య పద్ధతులలో సాంకేతికతను అందించాలనే లక్ష్యంతో 88.89 ఎకరాలను గతంలో టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. అయితే అందుకు అనుగుణంగా నిధులు, సిబ్బంది, సాంకేతికత లేకపోవడం, వైసీపీ ప్రభుత్వం అస్సలు పట్టించుకోకపోవడంతో ఈ పరిశోధనా కేంద్రం అభివృద్ధి లేక ఏళ్ల తరబడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ రీసెర్చ్ సెంటర్ పెట్టి 8 ఏళ్లు అయిందని, నిధుల కొరతతో పరిశోధనలు మొదలు కాలేదని ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రతాప్, దత్తారెడ్డి అనే ఇద్దరు సైంటిస్టులను ఇక్కడ నియమించామన్నారు. వీరి ఆధ్వర్యంలో మొదటి విడతగా 5 ఎకరాలను చదును చేయించి సాగులోకి తెస్తామన్నారు. బోర్లు వేసి పూలు, కూరగాయల పంటలపై పరిశోధనలను చేస్తామన్నారు.

రాష్ట్రంలో 20 ఉద్యాన పంటల పరిశోధనా కేంద్రాలు ఉండగా రాయలసీమలోనే 7కేంద్రాలున్నాయని, అన్నింటిలోనూ కార్యకలాపాలు ముమ్మరం చేస్తున్నామన్నారు. అనంతపురం, మహానంది, పులివెందుల, తిరుపతి, అనంతరాజుపేట (రైల్వేకోడూరు), పెట్లూరు (వెంకటగిరి)లలోని పరిశోధనా కేంద్రాలను పరిశీలించి చివరగా హార్సిలీహిల్స్ వద్ద ఉన్న ఈ పరిశోధనా కేంద్రాన్ని, ప్రభుత్వం కేటాయించిన భూములను చూశామన్నారు. ఇక్కడి వాతావరణం పంటల పరిశోధనలకు అనువుగా ఉందని, నిధులు విడుదలయ్యాక పరిశోధనలను పూర్తి స్థాయిలో చేపడతామన్నారు. కాగా డాక్టర్ మాధవిని తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సంబేపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఉద్యానశాఖ పరిశోధన కేంద్ర సమస్యను తీసుకెళ్లామని, రూ.7.50 కోట్లు కేటాయించాల్సిందిగా వినతిపత్రం ఇచ్చామన్నారు. నిధులు తెప్పించే బాధ్యత తీసుకుంటామని వివరించారు. ఆమె వెంట పలువురు ఉద్యానశాఖ అధికారులు ఉన్నారు.



భూములను పరిశీలిస్తున్న హార్టికల్చర్ యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ మాధవి

పండగకూ పప్పులేదు..!

- ఈనెలలోనూ మొండిచేయి
- మూన్నాళ్ల ముచ్చటేనా..?
- కార్డుదారులకు చక్కెరతోనే సరి

6



రైల్వేకోడూరులో పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం అభిరాం, తదితరులు



వేగవంతంగా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు

- డీఆర్ఎం అభిరాం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైల్వే అండర్ బ్రిడ్జి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ డీఏన్ అభిరాం తెలిపారు. రైల్వేకోడూరులో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి పనులు సక్రమంగా జరుగుతున్నాయని తెలిపారు. తమ శాఖాధికారులు అందరూ కాంట్రాక్టర్ చేస్తున్న పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. పనుల్లో ఎలాంటి రాజీ ఉండదన్నారు. పనులు సక్రమంగా చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి రైల్వేస్టేషన్ ముఖద్వారం, రామయ్యపాళెం ఎల్-87 రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యలను డీఆర్ఎం దృష్టికి తీసుకొచ్చారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని డీఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో కె.బుడుగుంటపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, కోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య, ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ మందల నాగేంద్ర, శ్రీనివాసులు, ఫరూక్, శంకరయ్య, కాంట్రాక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22ఏ దరఖాస్తులపై నివేదికలు ఇవ్వండి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సబ్‌కలెక్టరేట్‌లో 22-ఏ భూముల దరఖాస్తులను విచారిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో ఇప్పటి వరకు అందిన 22ఏ దరఖాస్తుల వివరాలపై నివేదికలు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో 11 మండలాల రెవెన్యూ అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆరు నెలలుగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు భూసమస్యలను త్వరగా పరిష్కరించేందుకు జిల్లాలోని మూడు డివిజన్ల వారీగా విచారణ నిర్వహిస్తున్నామన్నారు. మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాల్లో 27 వెబ్‌ల్యాండ్ పెండింగ్ ఫైళ్లను జేసీ పరిశీలించారు. మదనపల్లె, కురబలకోట మండలాల్లో పెండింగ్‌లో ఉంచిన ఏడు 22-ఏ దరఖాస్తులపై జేసీ ఆయా మండలాల తహసీల్దార్లను విచారించారు. సమావేశంలో తహసీల్దార్‌లు, ఆర్ఐలు, వీఆర్వోలు, పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ



రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీశ్‌కుమార్‌గుప్తాను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీని కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, అసాంఘిక కార్యకలాపాల కట్టడి కోసం తీసుకుంటున్న చర్యల గురించి డీజీపీకి వివరించినట్లు ఎస్పీ తెలిపారు.

రేపు సుప్రీంకోర్టు జడ్జి, హైకోర్టు చీఫ్ జస్టిస్ మదనపల్లె రాక

- కోర్టు భవనాల సముదాయం ప్రారంభం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి శనివారం మదనపల్లెలో పర్యటించనున్నారు. స్థానిక కోర్టు భవనాల సముదాయంపై మొదటి అంతస్థులో నిర్మించిన నూతన భవనాన్ని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలసి సుప్రీంకోర్టు జడ్జి ప్రారంభించనున్నారు. వీరితో పాటు హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, జిల్లా జడ్జి భీమరావు తదితరులు పాల్గొననున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మదనపల్లెలోని ప్రధాన ప్రభుత్వ శాఖ అధికారులకు కోర్టు అధికారులు సర్క్యులర్ పంపారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు

- 57 ఫైర్‌స్టేషన్లలో ప్రమాదాల నివారణ చర్యలు
- కర్నూల్ రేంజ్ రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రాయలసీమ రేంజ్ కర్నూల్ జోన్-4 రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి తెలిపారు. ములకలచెరువు అగ్నిమాపక కేంద్రాన్ని గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పే విధానంలో మెళకువలు పాటించాలని చెప్పారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని రాయలసీమలోని 57 ఫైర్‌స్టేషన్ల పరిధిలో ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. అగ్నిప్రమాదాలపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలిపారు. అగ్నిప్రమాదాలు జరిగితే సిబ్బంది తక్షణం స్పందించి ఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకోవాలన్నారు. అనంతనం స్థానిక అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు జరిగినపుడు మంటలు ఆర్పే విధానంపై మాక్‌డ్రిల్ చేశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ములకలచెరువు ఫైర్ ఆఫీసర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మంటలు ఆర్పే విధానాన్ని పరిశీలిస్తున్న రాయలసీమ జోన్ రీజనల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి

అంతా డ్రోన్లతోనే...!

- ఎరువుల నుంచి మందుల పిచికారీ వరకు...
- వ్యవసాయ డ్రోన్లకు పెరుగుతున్న డిమాండ్
- 80 శాతం సబ్సిడీ...మండలానికి ఒక్కటే
- ఖర్చు తక్కువ... రైతు గ్రూపులకు ఆదాయం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకం కింద వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ డ్రోన్లను రైతుల్లో డిమాండ్ పెరుగుతోంది. పురుగుమందుల పిచికారీ, నీటిలో కలసిపోయే ఎరువుల పిచికారీ, పూత కాపాడే మందుల పిచికారీ తదితర పనులను అవలీలగా చేసే ఈ వ్యవసాయ డ్రోన్ల వినియోగం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నాయి. దీంతో రైతులు ఈ డ్రోన్ల కోసం ఎగబడుతున్నారు.



వరి పైరుకు మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

వ్యవసాయ యాంత్రీకరణలో డ్రోన్ల పాత్ర

రైతులు ఉద్యాన పంటలైన టమోటా, వంగ, పూలసాగు, కూరగాయలు, ఆకుకూరల సాగు నుంచి వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు మందులు పిచికారీ చేస్తారు. దీంతో పాటు డ్రిప్ ద్వారా నీటిలో కలసిపోయే ఎరువులను మొక్కలకు అందిస్తారు. రైతులు వీపుకు పంపులు (మందులు పిచికారీ చేసే యంత్రాలు), డ్రిప్ పైపుల ద్వారా మొక్కలకు ఎరువులు కలిపిన నీటిని సాగు చేయడానికి ఎక్కువగా డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం గ్రాంట్లతో వ్యవసాయ డ్రోన్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక ఎకరాకు రైతులు మందులు పిచికారీ చేయాలంటే 3 నుంచి 4 గంటల సమయంతో పాటు ఎకరాకు రూ.600 నుంచి రూ.1000 వరకు ఖర్చు పెట్టాల్సి ఉంది. అదే డ్రోన్లతో మందులు పిచికారీ చేస్తే ఎకరా పొలానికి 10 నిమిషాల్లో మందులు పిచికారీ చేసేయొచ్చు. అంతేకాకుండా ఒక ఎకరాకు డ్రోన్‌తో మందుల పిచికారీ ఖర్చు కేవలం రూ.400 నుంచి రూ.600 వరకే ఉంటుంది. అలాగే పురుగుమందుల ఖర్చు కూడా 30 శాతం తగ్గుతుంది. నీటి వినియోగం కూడా తగ్గుతుంది. నీటిలో కలసిపోయే ఎరువులను కూడా డ్రోన్లతో పంటలకు పిచికారీ చేసే అవకాశం ఉండటంతో రైతుల సమయం ఆదాతో పాటు, ఖర్చు కూడా తగ్గుతుంది.

టమోటా సీజన్‌లో భలే గిరాకి

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో మార్చి నెల నుంచి టమోటా సీజన్ నడుస్తుంది. సుమారు 30 వేల హెక్టర్ల వరకు రైతులు టమోటా పండించనున్నారు. ఈ క్రమంలో టమోటా పంటలకు పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసేందుకు ఈ డ్రోన్ల ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. మండలానికి ఒక్కో డ్రోన్ మంజూరైనా నాలుగు నియోజకవర్గాల్లో 21 డ్రోన్లకు మంచి గిరాకీ ఉండనుంది.


టమోటా పంటకు గాలిలో నుంచే మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

80 శాతం సబ్సిడీ..వ్యవసాయ డ్రోన్లకు డిమాండ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌కేవీఎస్ పథకంలో పంపిణీ చేస్తున్న డ్రోన్ల కొనుగోలుకు రైతులకు 80 శాతం సబ్సిడీ అందిస్తున్నాయి. ఐదుగురు రైతులతో కూడిన ఒక గ్రూపును ఎంపిక చేసి ఆ గ్రూపులోని కన్వీనర్, కో-కన్వీనర్‌ల పేరుతో డీసీసీ బ్యాంకులో అకౌంటు తెరుస్తారు. వాస్తవంగా ఒక వ్యవసాయ డ్రోన్ ఖరీదు రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఇందులో రైతుల గ్రూపు రూ.2 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ డబ్బులు కూడా డీసీసీ బ్యాంకు రుణం ఇస్తుంది. మిగిలిన రూ.8 లక్షల సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. జిల్లాలో ఒక్కో మండలం యూనిట్‌గా కేవలం 30 డ్రోన్లను మాత్రమే ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్నాయి. దీంతో ఈ వ్యవసాయ డ్రోన్లను పొందేందుకు రైతుల మధ్య డిమాండ్ పెరిగిపోతోంది.

గ్రామీణ యువతకు ఉపాధి

గ్రామాల్లో ఇంటర్ చదువుకున్న యువతీ, యువకులకు డ్రోన్ ఆపరేటింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయి. వ్యవసాయ డ్రోన్ ఆపరేటింగ్ కోసం ఒక్కో మండలానికి ఒకరిని ఎంపిక చేస్తారు. వీరికి గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీలో 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ పదిరోజులు వీరికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు, ఇతర అలవెన్సులు కలిపి రూ.25 వేలు చెల్లిస్తారు. దీంతో పాటు డ్రోన్ ఆపరేటింగ్ లైసెన్సు కూడా మంజూరు చేస్తారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న పైలెట్‌లకు ఆయా మండలాల్లో రైతుల గ్రూపులకు మంజూరైన డ్రోన్ ఆపరేటింగ్ కోసం రెండేళ్ల అగ్రిమెంట్ చేసుకుంటారు. డ్రోన్ పొందిన రైతుల గ్రూపు ఆ మండలంలో డ్రోన్ అవసరమైన వారికి ఎకరాకు రూ.400 నుంచి రూ.600 చొప్పున అద్దె ప్రాతిపదికన అప్పగిస్తారు. ఒక్కో మండలంలో సీజన్‌ను బట్టి టమోటా, వంగ, మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలు సాగవుతాయి. ఈ క్రమంలో ఏడాది పొడవునా వ్యవసాయ డ్రోన్లతో మందులు, ఎరువుల పిచికారీ చేసే అవకాశాలు ఉంటాయి. దీంతో అటు రైతుల గ్రూపుకు, ఇటు పైలెట్‌కు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. శిక్షణ పొందిన పైలెట్లు పొలం చుట్టూ తిరిగి ఫీల్డ్‌మ్యాపింగ్ చేసి డ్రోన్ మానిటర్‌లో నమోదు చేస్తారు. దీంతో ఒక్కసారి పైకి ఎగిరిన డ్రోన్ ఖచ్చితత్వంతో పంటలకు, ప్రతి అడుగుకు, ప్రతి మొక్కకు మందులు, ఎరువులు పిచికారీ చేస్తాయి. పొలాల్లో అడ్డువచ్చే విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను గుర్తించి పక్కకు తొలగుతాయి. మరీ అడ్డు ఎక్కువగా ఉంటే తిరిగి పైలెట్ చెంతకు చేరిపోతాయి.

పండగకూ పప్పులేదు..!

- ఈనెలలోనూ మొండిచేయి
- మూన్నాళ్ల ముచ్చటేనా..?
- కార్డుదారులకు చక్కెరతోనే సరి



మదనపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీతో ఇస్తున్న కందిపప్పు సరఫరాకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో మూడునెలలు పంపిణీ చేసింది. అయితే ఫిబ్రవరి నెలకు సరఫరా ఆగిపోయింది. దీంతో నెలవారీ రెగ్యులర్‌గా ఇచ్చే బియ్యంతో పాటు చక్కెరతో సరిపెట్టుకుంది. ఇదే నెలలో శివరాత్రి పండగ ఉండటంతో కందిపప్పు ఇవ్వకపోవడం ఏంటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇప్పటికే ఉన్న స్టాకు గోదాము నిండుకోవడం, పైనుంచి స్టేజ్-1 పాయింట్‌కు స్టాకు రాకపోవడంతో ఇక్కడి అధికారులు కూడా చేతులెత్తేశారు. ఇప్పటికే ఆయా గోదాముల్లో ఉన్న స్టాకును అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లకు సర్దుబాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా చౌకధరల దుకాణంలో కందిపప్పు రూ.67కు అమ్ముతుండగా రూ.160కి పైగా ఉంది. దీంతో కార్డుదారులు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,126 చౌకదుకాణాల పరిధిలో 4,98,092 రేషన్‌కార్డులు ఉన్నాయి. అయితే ప్రతినెలా కార్డులోని యూనిట్లతో సంబంధం లేకుండా కిలో కందిపప్పు, అరకిలో చక్కెర పంపిణీ చేస్తున్నారు. కానీ ఫిబ్రవరి నెలకు కూడా కార్డుకు కిలో చొప్పున 4,98,092 కేజీల కందిపప్పు అలాట్ చేయాల్సి ఉంది. కానీ గోదాముల్లో అందుబాటులో ఉన్న కందిపప్పును అంగన్‌వాడీలకు సరఫరా చేయగా, రెగ్యులర్ కార్డుదారులకు నిలిపేశారు. అయితే ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన నిత్యావసర వస్తువుల సరఫరా మంగళవారానికి బియ్యం, చక్కెరను ఎండీయూల ద్వారా 14,885 అంత్యోదయ కార్డులు, 1,54,429 తెల్లరేషన్ కార్డులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా పౌర సరఫరాల శాఖకు కందిపప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్ గడువు ముగిసిపోయినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో తిరిగి కందిపప్పు సరఫరాకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించగా, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా కాంట్రాక్టర్ టెండర్ కోట్ చేయడంతో వాటిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ మధ్య ధర విషయంలో ఏకాభిప్రాయం కుదిరితే తప్ప కందిపప్పు వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా కందిపప్పు సరఫరా లేకపోవడంతో ఎండీయూ వాహనదారులు బియ్యం, చక్కెర పంపిణీకి ముందున్నంత ఆసక్తి చూపడం లేదు.


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- తుది దశకు చేరుకున్న ఉద్యాన క్రీడలు
- నేడు ముగియనున్న పోటీలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణంలో జరుగుతున్న అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం అలరించాయి. అలాగే వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, పరుగు పందెం, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నీస్, హైజంప్ తదితర పోటీలు నిర్వహించారు. అన్ని క్రీడలు తుది దశకు చేరుకున్నాయి.


భరత నాట్యం చేస్తున్న విద్యార్థిని


కబడ్డీ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న అనంతరాజుపేట క్రీడాకారిణులు


ఉద్యాన విద్యార్థులు గీసిన చిత్రం

శుక్రవారం క్రీడలు అన్నీ ఫైనల్స్ ఆడే ప్రక్రియను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఉద్యాన విద్యార్థులు వివిధ రకాల పూలతో రంగవల్లులు వేశారు. అలాగే పాటలు, భరతనాట్యం తదితరవి ఆకట్టుకున్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి కె.గోపాల్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశామని తెలిపారు. కొన్ని క్రీడలు పూర్తి కావడంతో విద్యార్థులకు బహుమతులు అందజేశామని తెలిపారు. భోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడలేదన్నారు.

విజేతలు వీరే

బ్యాడ్మింటన్ పోటీల్లో అనంతరాజుపేట బాలుర, బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలుర వాలీబాల్, బాలికల త్రోబాల్ విజేతగా నిలిచాయి. బాలికల హైజంప్‌లో ఎస్. లక్ష్మీహారిక (సీఎస్‌పురం), ఎల్.అనూషా (వీఆర్‌గూడెం), ఏ.లక్ష్మీ (పార్వతీపురం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

బాలుర డిస్కస్ త్రోలో రాహుల్ (వీఆర్‌గూడెం), శరత్‌చంద్ర (తాడిపత్రి), పృథ్వీ రాజ్ (పార్వతీపురం), మొదటి మూడు స్థానాల్లో సాధించారు. 400 మీటర్ల బాలుర పరుగుపందెంలో సిద్ధార్థ, అనిల్‌కుమార్, (వీఆర్ గూడెం) సాగర్ (అనంతరాజుపేట), బాలికల విభాగంలో యమున, అనూషా (వీఆర్‌గూడెం), ఎం.సమీర (అనంతరాజుపేట) మొదటి మూడు స్థానాలు సాధించారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

బస్సులో మరచిపోయిన రూ.1.50 లక్షల సొమ్ము ప్రయాణికుడికి అందజేత


చిన్నపరెడ్డికి డబ్బు అందజేస్తున్న డిపో మేనేజర్ రమణయ్య, కండక్టర్ మురళీధర్

రాజంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ఎస్.మురళీధర్ తన నిజాయితీని చాటుకున్నారు. బస్సులో ఓ ప్రయాణికుడు మరచిపోయి బస్సులో పెట్టి వెళ్లిపోయిన రూ.1.50 లక్షల సొమ్మును నిజాయితీగా తిరిగి ఆ ప్రయాణికుడికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో రాజంపేట నుంచి కడపకు వెళ్లే సర్వీసులో చిట్వేలికి చెందిన చిన్నపరెడ్డి అనే ఆటో డ్రైవర్ రూ.1.50 లక్షల సొమ్మును తీసుకెళ్లాడు. తాను పాత ఆటో అమ్మి వచ్చిన సొమ్ముతో కొత్త ఆటోను కొనేందుకు కడపకు ఆర్టీసీ బస్సులో వెళ్లాడు. బ్యాగులో పెట్టుకున్న ఆ నగదును పొరపాటున సీటుపై పెట్టి మరచిపోయి కిందకు దిగి వెళ్లిపోయాడు. ఇంతలో ప్రయాణికులందరూ దిగిపోయిన విషయాన్ని కండక్టర్ మురళీధర్ గమనిస్తుండగా ఓ సీటుపై బ్యాగు కనిపించింది. వెంటనే ఆ సొమ్మును తనవద్ద పెట్టుకుని వెనువెంటనే రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్యకు తెలియజేశారు. ఇంతలో కొత్త ఆటో కొనడానికి వెళ్లిన చిన్నపరెడ్డి షోరూం వద్దకు వెళ్లి డబ్బులు చూసుకోగా బస్సులో మరచిపోయిన విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన తాను వచ్చిన బస్సు కోసం వెనుదిరిగాడు. కడపలోని ఇతర ఆర్టీసీ కండక్టర్ల ద్వారా రాజంపేట ఆర్టీసీ డిపోకు తాను పోగొట్టుకున్న సొమ్ము విషయాన్ని తెలియజేశారు. డిపో మేనేజర్ రమణయ్య చిన్నపరెడ్డిని రాజంపేటకు పిలిపించి తమ తోటి సిబ్బంది సమక్షంలో చిన్నపరెడ్డికి కండక్టర్ మురళీధర్ ద్వారా తన చేతులమీదుగా ఆ మొత్తాన్ని అందజేశారు. దీంతో కండక్టర్ మురళీధర్‌ను అందరూ అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ కండక్టర్ మురళీధర్ నిజాయితీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మురళీధర్‌ను అభినందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

ముగ్గురు కూలీల అరెస్ట్

- ఆయుధాల స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రఘురాం

చిట్వేలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు కూలీలను గురువారం ఉదయం 7.30 గంటలకు కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు గొడ్డళ్లు, ఒక రంపం, 2 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘురాం తెలియజేశారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాల మేరకు సీఐ వెంకటేశ్వర్లు సూచనల మేరకు రాబడిన సమాచారంతో తాము సిబ్బందితో పోలీసు వాహనంలో వెళుతున్నామన్నారు. తమను చూసిన నిందితులు పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారించామన్నారు. తాము రైల్వేకోడూరు మండలం కొత్తపల్లె ఎస్టీ కాలనీకి చెందిన మద్దూరు చెంచుక్రిష్ణ(30), వద్దొలకోటి(25), మద్దూరు రమణయ్య(28), ఎన్‌వీఎస్ గిరిజన కాలనీలకు చెందిన వారుగా గుర్తించి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ రఘురాం తెలియజేశారు.

రేషన్‌షాపు ఆకస్మిక తనిఖీ


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రామాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు పంచాయతీ పక్కీరుపల్లెలో 1137029 గల రేషన్‌షాపును గురువారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రేషన్ షాపులో ఉన్న బియ్యం, చక్కెర, కందిబేడలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే చౌకదుకాణ వస్తువులను రేషన్ లబ్ధిదారులకు అందించాలన్నారు. తూకాల్లో తక్కువ రాకుండా సక్రమంగా పంపిణీ చేసే విధంగా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రామాంజనేయులు, లక్కిరెడ్డిపల్లె ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌కు చేరుకున్న షరీఫ్


బి.కొత్తకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ సలహాదారు, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎంఏ షరీఫ్ గురువారం రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కు చేరుకున్నారు. ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల పరిశీలన లో భాగంగా గురువారం కడప జిల్లాలో పర్యటించిన షరీఫ్ విడిది కోసం హార్సిలీహిల్స్ కు చేరుకున్నారు. ప్రొటోకాల్ మేరకు అధికారులు స్వాగతం పలికి, బస ఏర్పాట్లు చేశారు.

సింహవాహనంపై శ్రీనివాసుడి వైభవం

- బ్రహ్మోత్సవాల్లో వేడుకగా వాహన సేవల ఊరేగింపు
- నేడు కల్పవృక్ష, హనుమంత వాహన సేవలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడోరోజైన గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి వారు ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. వేదపండితులు గురువారం వేకువనే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. వాహన సేవల ముందు కోలాటలు, చెక్కభజనలు, భజన బృందాల కోలాహలం, భక్తుల గోవిందనామస్మరణలతో సాంస్కృతిక శోభ కనిపించింది. వాహన సేవ అనంతరం స్వామి వారికి ఆలయ మండపంలో పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, చందనంతో కనుల పండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి సింహ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రికి హనుమంత వాహన సేవలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, వేదపండితులు కృష్ణ ప్రసాద్ భట్టర్, రమేష్ స్వామి, సిబ్బంది నగేష్, టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, సోము శేఖర్, ఆదిరెడ్డి, తరుగు శివారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


సింహవాహనంపై విహరిస్తున్న శ్రీవారు


ముత్యపు పందిరివాహనంపై శ్రీవారు

దాహార్తి తీరేదెప్పుడో..!

● బోర్లు వేశారు.. బిల్లులు చేసుకున్నారు ● బోర్లలో చుక్కనీరు పడని వైనం
● రూ.3 కోట్ల నిధులు నీళ్లపాలు ● మంచినీటి కోసం పల్లె ప్రజల ఇక్కట్లు


జె.వడ్డెపల్లెలో మంచినీటి కోసం బిందెల క్యూ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడేళ్లుగా తీవ్ర వర్షాభావం నెలకొనడంతో మంచి నీటి పథకం బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొంది. దీంతో గత ఏడాది వైసీపీ ప్రభుత్వ హయంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.3కోట్లు జేజేఎం(జల్ జీవన్‌పథకం) పథకం కింద నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రతి గ్రామంలో 3, 4 మంచినీటి పథకం బోర్లు వేసి పైపులైను ద్వారా నీరు అందించినట్లు బిల్లులు మాత్రం చేసుకు న్నారు. అయితే ఏ గ్రామంలో చుక్కనీరు పడిన పాపాన పోలేదు. దీంతో చాలా గ్రామాల్లోని ప్రజలు మంచినీటి కోసం వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మండలంలోని పందిళ్లపల్లె, జె.వడ్డెపల్లె, దిన్నెపాడు వడ్డెపల్లె, బి.యర్రగుడి, కోనంపేట వడ్డెపల్లె, అనంతపురం హరిజనవాడ గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఈ గ్రామాలలో జేజేఎం నిధులతో 29 బోర్లు వేసినట్లు రూ.3 కోట్ల బిల్లులు చేసుకున్నారు. అయితే ఒక్క బోరులో కూడా చుక్క నీరు పడలేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇప్పటికీ పందిళ్లపల్లె జె.వడ్డెపల్లెలో తాగునీటి సమస్య తీరలేదు. గ్రామంలో సుమారు 130 కుటుంబాలు ఉన్నాయి. పాడి పశువులు, సూమారు 5వేలకు పైగా జీవాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 10 మంచినీటి బోర్లు వేశారు. ఏ బోరులో కూడా చుక్కనీరు పడ లేదు. దీంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. తాగునీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం వెలుగల్లు ప్రాజెక్టు నుంచి కుడికాలువ ద్వారా నీరు అందించాలని మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. వెలుగల్లు ప్రాజెక్టు నీరు అందిస్తే పందిళ్లపల్లె, కుర్నూతల, కస్తూరి రాజుగారిపల్లె, మద్దిరేవుల, కోనంపేట, బి.ఎర్రగుడి, దిన్నెపాడు గ్రామాలలో బోర్లు నిండుకుండలా ఉంటాయని.. తాగునీరు సమస్య తీరుతుందని చెబుతున్నారు. ఆ దిశగా శాశ్వత పరిష్కారం చూపుతు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


బీఏ నాగిరెడ్డిపల్లెలో వ్యవసాయబోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు



బోర్ల వద్ద కాపలా ఉండి..



ఊరునిండా 10 బోర్లు వేశారు. ఒక్క బోరులో కూడా చుక్కనీరు పడలేదు. ఉన్న ఒక్క బోరులో వచ్చే చుక్కచుక్క నీటిని ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండి తెచ్చుకుంటు న్నాం. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సక్రమంగా చేయడం లేదు. ఒక బజారుకే వదిలి వెళ్లిపోతున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది.

-వెంకటసుబ్బమ్మ, జె.వడ్డెపల్లె

పాచి నీళ్లు వస్తున్నాయి



మంచినీటి పథకం బోరు నుంచి పాచి నీళ్లు పచ్చగా వస్తున్నాయి. ఆ నీరు తాగడానికి సరిగా లేవు. వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుం టాన్నాం. బోరును రీబోరు చేయించాలి. అధికారులు చర్యలు చేపట్టి రానున్న వేసవికాలంలో అయినా మంచినీరు అందించాలి.

-రమణమ్మ, జే.వడ్డెపల్లె

గుండెపోటుకు ఉచిత వైద్యం

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్


గుండెకు భరోసాపై అవగాహన పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టెమీ అనే గుండెపోటు వ్యాధికి రూ.45వేలు విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చి ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం జిల్లా ఆస్పత్రిలో గుండెపోటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆక స్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం లాంటి లక్షణాలన్నీ గుండె పోటుకు సంబంధించినవన్నారు. ఇలాంటి లక్షణాలు గమనించి మొదటి గంట అత్యంత కీలకమన్నారు. ఈలోపు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రికి గానీ తీసుకు వస్తే టెనెక్టెప్లెస్ ఇంక్షన్‌తో ప్రాణాలు కాపాడతార న్నారు. ఈ ఇంజెక్షన్ ప్రైవేటు ఆసుత్రుల్లో రూ.45 వేలు అవుతుందని అలాం టిది ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌టీఆర్‌వైద్య సేవల కింద బైపాస్‌సర్జరీ ఉచితంగా చేస్తారన్నారు. కార్యక్ర మంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ఎన్ఎన్ఎంలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కర్నూలులో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయితల సంఘం 25వ రాష్ట్ర సాహిత్య పాఠశాల ఈ నెల 8,9 తేదీలలో కర్నూలులోని వెంకటాద్రిన గర్ వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు విరసం రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు పి.వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల కరపత్రాలను ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ 1970లో ఆవిర్భవించిన విప్లవ రచయిత సంఘం ఎన్నో నిర్బంధాలను నిషేధాలను తట్టుకుని కవులు, రచయితలు ప్రజా పక్షం వుండాలనే ఒక ప్రజాస్వామిక సాంప్రదాయాన్ని నిలబెట్టిందన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సంక్షోభకాలంలో సాహిత్యకారుల పాత్రను చర్చించా ల్సిన అవసరం వుందన్నారు. ప్రజల పక్షాన సాహిత్యకారులను నిలబెట్టాల్సిన సందర్భం అన్నారు. ఈ రెండు రోజులు సాహిత్య పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రచయితలు, కవులు, కళాకారులతో పాటు ఉద్యమ అభిమానులు, ప్రజాస్వామిక వాదులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తవ్వాసురేష్, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సుద్దపల్లె మురళి, రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యుడు సుబ్బయ్య ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దయగల తల్లి మరియతల్లి


మాట్లాడుతున్న ఫాదర్ వరప్రసాద్

కడప కల్చరల్ ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి) : విశ్వాసుల పట్ల దయగల తల్లి మరియ తల్లి అని కడప పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఎం.వరప్రసాద్ కొనియాడారు. మరియాపురం లూర్ధుమాత తిరుణాల మహోత్సవాలలో భాగంగా గురువారం రా త్రి పాత చర్చి ఆవరణంలో జరిగిన నవ దిన పూజా ప్రార్థనల్లో విశ్వాసులు భక్తిభా వంతో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన విశ్వాసుల నుద్దేశించి దైవ సందే శం ఇచ్చారు. పాపులను రక్షించేందుకే మరియతల్లికి యేసుప్రభువు మానవు నిగా జన్మించారన్నారు. అంతకు ముందు విచారణ గురువు ఫాదర్ సిప్రియన్ దివ్యబలిపూజ గావించారు. తిరుణాల కమిటీ ప్రతినిధులు జ్యోతిరాయప్ప, బాలశౌరి, ప్రదీప్, ఆనంద్, ప్రసాద్‌తో పాటు విశ్వాసులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం (ఎంవీపీ కాలనీ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పుఘర్ సమీపంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్ హాస్టల్ లో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంకటశెట్టి పల్లి సమీపంలోని రాజుపాలానికి చెందిన వెలిగండ్ల కార్తీక్ రాజు (22) విజయనగరంలోని ఏవీజీఆర్ ఇంజనీరింగ్ కళా శాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఓ కంపెనీ లో కోర్సు చేసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కొద్ది రోజుల త ర్వాత ఉద్యోగంలో జాయిన్ కావాలంటూ ఫోన్ కాల్ రావ డంతో మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో గత నెల 31న చేరా డు. అప్పటి నుంచి నగరంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం ఉదయం నుంచి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ నిర్వాహకులు అతడు ఉంటున్న గది తలుపులు తెరచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కని పించాడు. దీంతో వసతిగృహం నిర్వాహకులు ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా చక్రస్నానం... తరించిన భక్తజనం

● హంస వాహనంపై విహరించిన వీణాధరుడు ● ధ్వజావరోహణంతో ముగిసిన దేవుని కడప బ్రహ్మోత్సవాలు


పుష్కరిణిలో చక్రస్నానం ఆచరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): తిరు మల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్స వాలు ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి. బ్రహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు శ్రీలక్ష్మీవేకంటేశ్వరుడు వీణాధరుని అలంకారంలో హంస వాహనంపై మాడవీధు లలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఊరే గింపు ముందు భాగాన చెక్కభజన, కోలాటం కళా కారులు లయబద్ధమైన నృత్యాలు భక్తులను అల రింపచేశారు. అంతకు ముందు ఉదయం 8 నుం చి 9 గంటల వరకు వసంతోత్సవం ఆనందకర వాతావరణంలో చేసు కున్నారు. 9 నుంచి 10-30 వరకు తిరుమలేసుడి చక్రత్తాళ్వార్‌ను ఆలయ అర్చకులు క్రిష్ణమోహన్, త్రివిక్రమ్, క్రిష్ణమూర్తి, తరణ్, సాయిలు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ సమీప పుష్కరిణిలో ఉత్సవమూర్తుల విగ్రహాలకు గందాధి లేపనాలతో అవభృత చక్ర స్నానం నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యా లతో అభిషేకించారు. చక్రస్నానానికి భక్తులు విశేషంగా హాజరై పుష్కరిణిలో అత్యంత భక్తిశ్రద్ధలతో స్నానమాచరించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు. కార్య క్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇరువురికి గాయాలు

సికెదిన్నె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాల య్యాయి. ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్ధన్, బైక్‌పై ఉన్న బత్తల సుబ్బయ్య అనే వ్యక్తులకు గాయాలు అయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు గురువారం ఉద యం కడప-రాయచోటి జాతీయ రహదారిలోని జమాల్‌పల్లి వద్ద ట్రాక్టర్ ఆగి ఉండగా పక్కనే బైక్‌పై మరో వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న సిమెంటు లారీ ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో ట్రాక్టర్ ఫల్టీ కొట్టడంతో డ్రైవర్ జనార్ధన్‌తో పాటు బైక్‌పై ఉన్న బట్టల సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

కారు ద్విచక్రవాహనం ఢీకొని...

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి లోని శీలంవారిపల్లె వద్ద గురువారం సాయంత్రం కారు, ద్విచ క్రవాహనం ఢీ కొనడంతో పెంచలయ్య (చిన్న) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పెంచలయ్య బద్వేలు పట్టణంలో పెయింట్ పనికి వెళ్లి తిరిగి లక్ష్మీపాలెంలోని తన ఇంటికి ద్విచక్రవాహ నంలో వస్తున్నాడు. ఆ సమయంలో రహదారిపై గేదెలు అడ్డం గా రావటంతో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో పెంచలయ్యకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుల ప్రయోగానికి రూ.34లక్షలు మంజూరు

● ముగ్గురు అధ్యాపకుల ఎంపిక


అధ్యాపకులు అమరేంద్రకుమార్, మహబూబ్ జిలానీ, రమేష్

వేంపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో కొత్త పరిశోధనల కోసం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు మూడు ప్రాజెక్టులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రీయ ఉచిత శిక్షణ అభియాన్ ద్వారా మూడు కొత్త ప్రాజెక్టుల పరిశోధనల కోసం రూ.34లక్షలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఇ డుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రొఫెసర్ అమరేం ద్రకుమార్, మహబూబ్ జిలాని, జి.రమేష్‌లు ఈ ప్రాజెక్టులకు ఎంపిక య్యారన్నారు. అధ్యాపకులు చేసే క్రొత్త పరిశోధనల వల్ల ఇంజనీరింగ్ విద్యార్థులకు, పరిశ్రమలకు మంచి ఫలితాలు లభిస్తాయని డైరెక్టర్ ఆకాంక్షించారు.

వైవీయూ అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ప్రొఫెసర్ చంద్ర ఓబుల్‌రెడ్డి


నియామకపత్రం అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైవీ యూని వర్సిటీ డీన్‌గా విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఆచార్యులు పి.చంద్ర ఓబుల్‌రెడ్డిని నియమించారు. గురువారం విశ్వవి ద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య చంద్రఓబుల్‌రెడ్డికి ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి కులసచివులు మరియు ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఇది వరకు ఈ స్థానంలో పనిచేసిన కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దాము పదవీకాల పూర్తికావడంతో ఈ నూతన నియామకం చేప ట్టారు. కార్యక్రమంలో ఆచార్య టి.చంద్రశేఖర్ పాల్గొన్నారని ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత పేర్కొన్నారు.

వెలుగు యానిమేటర్ల చేతివాటం

● రూ.కోట్లలో గ్రూపు సభ్యులకు టోకరా
● చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
● ఏడాదిగా లభించని యానిమేటర్ మల్లిక ఆచూకీ



ముద్దనూరు ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు యానిమేటర్లు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. మూడు సంవత్స రాల నుంచి యానిమేటర్లు గ్రూపు సభ్యులకు వేస్తున్న టోకరాలు ఒకొక్కటిగా ఆధారాలతో బయటపడుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో యానిమే టర్ల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోతోందన్న విమర్శలు విని పిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

మండలంలో వెలుగు సంఘం గ్రూపులు దాదాపు 730 ఉండగా.. సభ్యులు దాదాపు 7982 మంది ఉన్నారు. 32 మంది యానిమేటర్లు ఉన్నారు. వీరిలో కొంత మంది యానిమేటర్లు గ్రూ పు సభ్యులను మోసం చేస్తున్నారు. గతంలో ఉప్పలూరు గ్రామం లో ఇద్దరు (భార్యా భర్త) యానిమేటర్లు చేతివాటం ప్రదర్శించారు. శ్రీనిధి గ్రూపు సభ్యుల నుంచి దాదాపు రూ.60లక్షల దాకా టోకరా వేశారు. అయితే ఇద్దరు మృతి చెందడంతో ఈ వ్యవహారం అంతా భయటపడింది. అలాగే యామవరం గ్రామంలోని మరో యానిమే టర్ శ్రీనిధి గ్రూపు సభ్యులకు దాదాపు రూ.30లక్షలకు టోకరా వే శారు. అయితే ఏపీఎంపై ఆరోపణలు రావడంతో వారిని సస్పెండ్ చేశారు. యామవరం యానిమేటర్‌పై కేసు నమోదు చేసి సరిపె ట్టుకున్నారు తప్ప డబ్బులు రికవరీ చేయలేకపోయారు. ముద్దనూ రు టౌన్‌లోని మరో యానిమేటర్ మల్లిక దాదాపు రూ.50లక్షలు వీవో, గ్రూపు సభ్యుల నుంచి వసూళ్లు చేసి టోకరా వేసి పరారై ఏ డాది కావస్తోంది. అయితే ఆ యానిమేటర్‌పై కనీసం కేసు కూడా పెట్టలేదు. వీవో డబ్బులు తమకు ఎటువంటి సంబంధం లేదన్న ట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో యానిమేటర్లు టోక రా వేయడంతో జిల్లా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసు కొని కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ యానిమేటర్ మల్లికా ఆ చూకీ లేకపోవడంతో విధుల నుంచి తొలగించి ఆ యానిమేటర్ స్థానంలో మరొకరిని పెట్టుకొన్నట్లు తెలిసింది. కాగా, యానిమేటర్ కుటుంబ సభ్యులు ముద్దనూరులో ఉన్నారు. యానిమేటర్ ఆచూకీ లేదు, ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, ఆయానిమేటర్‌ను ఏవి ధంగా తొలగించి ఆమె స్థానంలో మరొకరికి ఉద్యోగం ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. గతంలో చేతివాటం ప్రదర్శించిన యానిమేటర్లపై నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో అదే బాటలో మరికొందరు యానిమేటర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం



గతంలోనే అప్పటి ఇన్‌చార్జి ఏపీఎం ఇ బ్రహీం పోలీస్‌స్టేషన్‌లో యానిమేటర్ మల్లికపై ఫిర్యాదు చేశారు. అయితే పో లీసులు కేసు నమోదు చేయలేదు. తిరి గి రెండు రోజుల క్రితం వీవోకు సంబం ధించి డబ్బులు యానిమేటర్ మల్లిక వాడుకున్నారని వీవో అధ్యక్షురాలు, సీసీ లు వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పీడీ వద్ద లె టర్ తీసుకురావాలని పోలీసులు తెలిపారు. అందుకే పీడీకి లెటర్ పెడుతున్నాం.యానిమేటర్ మల్లిక స్థానంలో మరొకరిని చేర్చుకోవ డం జరిగింది. మండలంలో ఇద్దరు యానిమేటర్లకు 60 ఏళ్లు పైబ డటంతో వారి స్థానంలో కూడా వేరేవారిని సమావేశంలో తీర్మానం చేసి చేర్చుకున్నాం.

-అపర్ణదేవి, ఏపీఎం,ముద్దనూరు

ఆత్మహత్యలపై విచారణ చేయాలి

● ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం బోయన పల్లెలో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో అనేక మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. గురువారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నమాచార్య విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆత్మహత్యలకు వేదికగా మారిందని ఆరోపించారు. ఈ విద్యాలయంలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణ, ఆదినారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం

రామాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో వెలసిన మరకత శివలింగం శివాలయంలో ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు ధ్వజ, పార్వతి, మూలవర్ల విగ్రహాల ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యనిర్వాహకులు తెలిపారు. 8న ఉదయం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, గంగామాత పూజ, కలశపూజ, యంత్రపూజ, మహామంగళహారతి, సాయంత్రం ముగ్గుల పోటీలు, సైకిల్ పోటీలు, కుర్చీ పోటీలు, అనంతరం పాటకచేరి కలదు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, అగ్ని దీక్షాహోమం మూల మంత్రం, మంత్ర జపాలు, జలనివాసం మంగళహారతి, 9వ తేది ఉదయం పాతఃకాల పూజ, కలవపూజ, యంత్రపూజ, రుద్రాభిషేకం, హోమాలు, శివపారాయణం, నవగ్రహ పూజలు, మహా మంగళహారతి, సాయంత్రం కోలాటం చెక్కభజన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జపాలు, హోమాలు, 10న ఉదయం మహాగణపతి, పార్వతి, మూలవర్ల విగ్రహాల ప్రతిష్ఠ, అభిషేకాలు, గోమాత పూజ, శివపార్వతుల కల్యాణం, తీర్థప్రసాదాలు, అన్నదానం, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మట్టి రోడ్లు లేకుండా తీర్చిదిద్దడమే లక్ష్యం

● జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్



సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మట్టి రోడ్లు లేని రైల్వేకోడూరుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉన్నామని జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. గురువారం పట్టణంలోని పాతబజారు వీధికి వెళ్లే దగ్గర ఆక్రమణలు తొలగించి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో పల్లె పండుగలో భాగంగా సిమెంట్ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామని తెలిపారు. కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, కూటమి నాయకులు నార్జాల హేమరాజ్, కొప్పరపు అరవింద్, ఉంగరాల సాయి, ఉంగరాల చిన్నా, పఠాన్ మౌల, యెలిశెట్టి వెంకటేష్, సంగరాజు రవికుమార్‌రాజు, యెలిశెట్టి శంకర్, రాజశేఖర్, సుబ్బిరామిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టలు, డ్రమ్ములు అమ్మేశారు

● రెవెన్యూ అధికారులకు ఎంఆర్‌పీఎస్ నాయకుల ఫిర్యాదు



ఆర్ఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంలో భాగమై వ్యవసాయం చేస్తున్న రైతులకు అందాల్సిన పట్టలు, డ్రమ్ముల పంపిణీలో అవకతవకలు జరిగాయని, అర్హులకు ఇవ్వకుండా అమ్ముకున్నారని ఎంఆర్‌పీఎస్ నాయకులు మహదేవ, నాగేశ్వర, లోకేశ్‌లు గురువారం ఆర్ఐ శ్రీనివాసులునాయక్‌కు ఫిర్యాదు చేశారు. 2024 సంవత్సరంలో ప్రకృతి సేద్యం చేస్తున్న ఎస్సీ రైతులకు 44 మందికి ఒక్కొక్కరికి ఇక చిన్న పట్ట, ఒక పెద్ద పట్ట, రెండు డ్రమ్ములు ప్రభుత్వం అందజేసింది. వాటిని ఆదేశాఖలో పనిచేసే ముగ్గురు వ్యక్తులు ఇతరులకు అమ్ముకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. నిజమైన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

దండుమారెమ్మకు అభిషేకం, పూజలు

సుండుపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం సందర్భంగా మండలంలోని భాగంపల్లి గ్రామ పంచాయతీ కుంటల ముందరలో వెలసిన దండుమారెమ్మకు గురువారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పాఠశాలా.. డంపింగ్ యార్డా..!

● ప్రవేశ ద్వారం వద్ద చెత్తకుప్పల స్వాగతం ● విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

గాలివీడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద పడి ఉన్న చెత్తకుప్పలను చూసి ఇది పాఠశాలా.. లేక డంపింగ్ యార్డా... అని తల్లిదండ్రులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల మంది విద్యార్థులతో రద్దీగా ఉంటే పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న ధ్యాస ఉపాధ్యాయులకు గానీ, చుట్టుపక్కల వారికి గానీ లేకపోవడం విచారకరం. ఆ పాఠశాలలో చదువుతున్నది తమ పిల్లలేనని తెలిసినా కొందరు చట్టుపక్కల వారు తమ ఇళ్లల్లోనే చెత్తాచెదారం, వ్యర్థాలను ఎంచక్కా పాఠశాల ప్రవేశ ద్వారం ముందు పడవేస్తున్నారు. తరువాత ఎప్పుడో తీరిగ్గా వచ్చే చెత్త సేకరణ బండి వచ్చే వరకు విద్యార్థులు ఆ దుర్గంధం, దుర్వాసనలను పీల్చాల్సిందే. ఒక వేళ ఒకటి, రెండు రోజుల పాటు చెత్త సేకరణ బండి రాకపోతే ఇక చెత్తకుప్పలతో పాఠశాల ప్రాంగణమంతా డంపింగ్ యార్డును తలపిస్తుందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు పాఠశాల లోపలికి వెళ్లాలంటే దుర్వాసనలతో ముక్కులు మూసుకుని వెళ్లాల్సిందేనని వాపోతున్నారు. ఈ వ్యర్థాలతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు పాఠశాల వద్ద పారిశుధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలుర ఉన్నత పాఠశాల వద్ద వేసిన చెత్తకుప్ప



నూతన తహసీల్దార్‌గా వెంకటేశ్



వీరబల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల నూతన తహసీల్దార్‌గా వెంకటేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రావణి ఇటీవల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. సంబేపల్లె మండల తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్ ప్రస్తుతం వీరబల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. పలువురు అధికారులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోండి

- షరీఫ్‌ను కోరిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్‌హుస్సేన్



షరీఫ్‌ను సన్మానిస్తున్న ముస్తాక్ హుస్సేన్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను కూటమి ప్రభుత్వం ఆ జీవోను పూర్తిగా రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా ఉర్దూ మీడియం పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్‌హుస్సేన్ ఏపీ మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌ను కలిసి విన్నవించారు. గురువారం రాయచోటి పట్టణంలోని మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎంఏ షరీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్తాక్‌హుస్సేన్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఉర్దూ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం షరీఫ్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

● పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండస్ట్రియల్ కాలనీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని రాయచోటి బీజేపీ నేతలు శివగంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఇండస్ట్రియల్ ఏరియాలో కబ్జాకు గురైన స్థలాలను, అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. గత పాలనలో పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియా 578/7 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, స్థానిక ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రాయచోటి మండల రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. అధికారుల అండదండలతో పేదల ఇంటి స్థలాలను సైతం కబ్జా చేసిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు పది కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రెవెన్యూ, మున్సిపల్, ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా వారికి అనుమతులు లేకపోయినా వైసీపీ నేతలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు అక్రమంగా నిర్మించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే పేదల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని వారు హెచ్చరించారు.

సుభహాన్‌కు మెరుగైన వైద్యం అందించండి

● ట్విట్టర్‌లో స్పందించిన మంత్రులు లోకేశ్, మండిపల్లి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6: మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెలో నివాసం ఉంటున్న షేక్ సుభహాన్‌కు మతిస్థిమితం లేదు. ఇతని కాళ్లకు గాయాలయ్యాయి. గత ఐదేళ్లుగా బాధపడుతుండగా ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది చూసిన మంత్రులు లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు స్పందించారు. మండల టీడీపీ ఇన్‌చార్జ్ మదన్‌మోహన్‌కు ఫోన్ చేసి సుభహాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని, ఖర్చు ఎంతైనా తామే భరిస్తామని తెలిపారు. దీంతో వారు సుభహాన్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు తరలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్తార్ అహ్మద్, జెకె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన రాయచోటి టీడీపీ నేతలు



రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలతో రాయచోటి టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీ రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలను గురువారం రాయచోటి టీడీపీ నేతలు వెంకట్రమణారెడ్డి, కోడి శ్రీనివాసులరెడ్డి, సంజీవరెడ్డి, జయరాంరెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో అత్యంత వెనుకబడి ఉన్న రాయచోటి నియోజకవర్గంలో నెలకొని ఉన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాయచోటి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామంటూ పక్కా మోసం

పెనగలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ కాంప్లెక్సులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామంటూ కొందరు మోసగాళ్లు పట్టపగలే పత్తా లేకుండా పోయిన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద బేరసారాలు జరిపి ఎవరి దగ్గర ఎంత మొత్తంలో దొరుకుతుందో, దొరికినకాడికి దోచుకుని అడ్రస్సు లేకుండా పోయిన సంఘటన 2 రోజుల కిందట జరిగినట్లు మండల కేంద్రంలో పుకార్లు, షికార్లుగా నడుస్తున్నాయి. నేరుగా జరిగిన ఈ సైబర్ నేరంలో బాధితులు చాలామంది ఉన్నారని తెలుస్తోంది. అయితే తాము మోసపోయిన సంగతి చాలామందికి తెలిస్తే పరువు పోతుందని, డబ్బు పోయినా గుట్టుచప్పుడు కాకుండా కొంతమంది ఉన్నారని సమాచారం. ఇదిలా ఉండగా ఇద్దరు వ్యక్తులు రెండు రోజుల నుంచి పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. తమ షాపుల్లో సీసీ కెమెరాలు బిగిస్తామని ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద బాగా నమ్మబలికి ప్రస్తుతానికి కొంత అడ్వాన్స్ ఇవ్వాలని, ఒక్కొక్కరి వద్ద రూ.15 వేల వంతున డబ్బులు దండుకొని పరారైనట్లు సమాచారం. ఓ వైపు ప్రభుత్వం సెల్‌ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా సైబర్ నేరాల గురించి హెచ్చరిస్తున్నా మోసగాళ్ల ఉచ్చులో చిక్కుతున్నారని చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో ప్రత్యక్షంగా సైబర్ నేరం జరిగిన షాపులన్నీ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో చుట్టుపక్కల ఉన్నవే కావడం గమనార్హం. వారి షాపు నుంచి గట్టిగా కేక వేసినా స్టేషన్ నుంచి పోలీసులు పరిగెత్తుకొంటూ వచ్చి నేరస్థులను చుట్టుముట్టే పరిస్థితి ఉంది. ఈ విషయంపై పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డిని వివరణ కోరగా.. ఇటువంటి సంఘటనలు జరిగినట్లు కొంత మంది వ్యక్తులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఆ కోణంలోనే పరిశీలన జరుపుతున్నట్లు తెలిపారు.

వీధిలైట్లు ప్రారంభం

సిద్దవటం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీలోని భాకరాపేట నుంచి బెటాలియం వరకు నూతనంగా వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం స్థానిక నాయకులు విద్యుద్దీపాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి పరంగా పెద్దపల్లి గ్రామ పంచాయతీలోని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానంలో భాగంగా వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్ నాయుడు, ఉపసర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నిత్యపూజకోనకు దారెటు..?

● గుంతలమయమైన రహదారి ● భక్తులకు తప్పని ఇబ్బందులు

సిద్దవటం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజకోనకు దారి ఎటు..? అంటూ శివ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివ రాత్రి ఉత్సవాలు దగ్గర పడుతున్నా దేవదాయశాఖ పరిధిలో ఉన్న నిత్యపూజకోనకు వెళ్లే రహదారి పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపు తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు రహదారి పూర్తిగా దెబ్బతినడంతో భక్తులకు ఇబ్బంది తప్పలేదు. కోనకు వెళ్లే రహదారి ఆశ్రమం నుంచి సుమారు 9 కి.మీ. పంచలింగాల స్వామిగుడి వరకు భక్తులు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నా ఎండోమెంట్‌శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. మూడు రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో ఉమ్మడి కడపజిల్లా నుంచి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకుంటారు. దెబ్బతిన్న రహదారి పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. దెబ్బతిన్న రహదారులపై దేవదాయశాఖ రాజంపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌ను వివరణ కోరగా రహదారుల మరమ్మతులకు ఫిబ్రవరి 5న కలెక్టర్, రోడ్ల భవనాలశాఖ అధికారులకు నివేదిక పంపించామన్నారు.



పంచలింగాల వద్ద భక్తులు వెళ్లే రహదారిలో దర్శనమిస్తున్న పెద్ద బండలు

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగేందుకు పోటీ పడుతున్న భక్తులు

నందలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకినేనిపల్లె పంచాయతీ కుంపినీపురంలో వెలసిన వరాహ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజున గురువారం రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. ఈ రథోత్సవంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసి పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచేగాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో ఉన్న జాగీర్‌దారుల వంశస్థులు రథాన్ని లాగడంతో ఊరేగింపు ప్రారంభమైంది. రథోత్సవం కుంపినీపురం, మిద్దెల, బలిజపల్లె గ్రామాలమీదుగా బాణసంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల మధ్య రంగులు చల్లుకుంటూ అత్యంత వైభవంగా కొనసాగింది. ఉదయం ఆలయంలో పుణ్యాహవచనం, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

పాదయాత్ర సవ్యంగా సాగేందుకు హోమాలు



అయ్యవారిపల్లెలో హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెంచలకోనకు 10వ పాదయాత్ర కోసం మండలంలోని అయ్యవారిపల్లెలో గ్రామస్తులు పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి మాలలు 40 రోజుల పాటు ధరించారు. గురువారం పాదయాత్ర సవ్యంగా జరగాలని హోమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అయ్యవారిపల్లె గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ, వీపీఆర్ కండ్రిక మాజీ సర్పంచ్ పుష్పలత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ రెస్టారెంట్ తనిఖీ

● పట్టుబడ్డ సిలిండర్లు



పట్టుబడ్డ గ్యాస్ సిలిండర్లతో అధికారులు

సిద్దవటం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి చావ ుం డే శ్వ రి పేట సమీప ప్రాంతంలో గురువారం ఉదయం బాలాజీ ఫ్యామిలీ రెస్టారెంట్ హోటల్లో డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి గీతావాణి తనిఖీలు చేపట్టి 4 ఇండేన్‌గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి గ్యాస్ ఏజెన్సీకి అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ బాలాజీ ఫ్యామిలీ రెస్టారెంట్, హోటల్లో తనిఖీలు చేయగా 4 ఇంట్లో వాడే సిలిండర్లు గుర్తించామని, హోటల్ యజమాని ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలియజేశారు. రెస్టారెంట్, హోటల్లో ఇండేన్ గ్యాస్ సిలిండర్లు ఉపయోగించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సప్లై తహసీల్దారు సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

నక్షత్రవాటిక ప్రారంభం



కళాశాల ప్రాంగణంలో నక్షత్రవాటికను ప్రారంభిస్తున్న ఉపకులపతి గోపాల్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణంలో గురువారం ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కే.గోపాల్ నక్షత్రవాటికను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ఫర్ మదర్ కాంపైన్‌లో భాగంగా నక్షత్రాలకు సంబంధించిన మొక్కలను నాటామని తెలిపారు. తన జన్మనక్షత్రం రేవతికి అనుగుణంగా విప్ప మొక్క, డీఎస్‌ఏ డాక్టర్ సూర్యకుమారి జన్మ నక్షత్రం పుష్యమికి అనుగుణంగా రావిచెట్టు, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తన నక్షత్రానికి అనుగుణంగా కదంబం మొక్కను నాటామని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ జన్మ నక్షత్రానికి అనుగుణంగా మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌ఏ సయ్యద్ సదరున్నిసా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దీప్తికిరణ్, నిశ్చల, అధ్యాపకులు రామయ్య, కే.లలిత పాల్గొన్నారు.

బంజరు భూములు పంపిణీ చేయాలి

● తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన

పుల్లంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగంపల్లె, కరింపాకు, రాచపల్లె గిరిజనులకు బంజరు భూములు పంపిణీ చేయాలని పలుమార్లు విన్నవించుకోవడం జరిగిందని, వెంటనే గిరిజనులకు బంజరు భూములు పంపిణీ చేయాలని డీకేఎంయూ నాయకులు గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, డీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య ఆధ్వర్యంలో జెండాలు చేతబట్టి నిరసన తెలియజేశారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే ఈ నెల 13 నుంచి తహసీల్దారు కార్యాలయం ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి క్రిష్ణవేణి, గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

కామాక్షిదేవి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు



ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

సిద్దవటం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లి సమీపాన నూతనంగా నిర్మించిన కామాక్షిదేవి ఆలయంలో గురువారం చండీహోమం, జయహోమార్చన, పారాయణ అభిషేకాలు తదితర కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం నూతన కామాక్షిదేవి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఆలయ పూజారి సీతారామశాస్త్రి తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలన్నారు.

అంతా డ్రోన్లతోనే...!

- ఎరువుల నుంచి మందుల పిచికారీ వరకు...
- వ్యవసాయ డ్రోన్లకు పెరుగుతున్న డిమాండ్
- 80 శాతం సబ్సిడీ...మండలానికి ఒక్కటే
- ఖర్చు తక్కువ... రైతు గ్రూపులకు ఆదాయం

వరి పైరుకు మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకం కింద వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ డ్రోన్లను రైతుల్లో డిమాండ్ పెరుగుతోంది. పురుగుమందుల పిచికారీ, నీటిలో కలసిపోయే ఎరువుల పిచికారీ, పూత కాపాడే మందుల పిచికారీ తదితర పనులను అవలీలగా చేసే ఈ వ్యవసాయ డ్రోన్ల వినియోగం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నాయి. దీంతో రైతులు ఈ డ్రోన్ల కోసం ఎగబడుతున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణలో డ్రోన్ల పాత్ర

రైతులు ఉద్యాన పంటలైన టమోటా, వంగ, పూలసాగు, కూరగాయలు, ఆకుకూరల సాగు నుంచి వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు మందులు పిచికారీ చేస్తారు. దీంతో పాటు డ్రిప్ ద్వారా నీటిలో కలసిపోయే ఎరువులను మొక్కలకు అందిస్తారు. రైతులు వీపుకు పంపులు (మందులు పిచికారీ చేసే యంత్రాలు), డ్రిప్ పైపుల ద్వారా మొక్కలకు ఎరువులు కలిపిన నీటిని సాగు చేయడానికి ఎక్కువగా డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం గ్రాంట్లతో వ్యవసాయ డ్రోన్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక ఎకరాకు రైతులు మందులు పిచికారీ చేయాలంటే 3 నుంచి 4 గంటల సమయంతో పాటు ఎకరాకు రూ.600 నుంచి రూ.1000 వరకు ఖర్చు పెట్టాల్సి ఉంది. అదే డ్రోన్లతో మందులు పిచికారీ చేస్తే ఎకరా పొలానికి 10 నిమిషాల్లో మందులు పిచికారీ చేసేయొచ్చు. అంతే కాకుండా ఒక ఎకరాకు డ్రోన్‌తో మందుల పిచికారీ ఖర్చు కేవలం రూ.400 నుంచి రూ.600 వరకే ఉంటుంది. అలాగే పురుగుమందుల ఖర్చు కూడా 30 శాతం తగ్గుతుంది. నీటి వినియోగం కూడా తగ్గుతుంది. నీటిలో కలసిపోయే ఎరువులను కూడా డ్రోన్లతో పంటలకు పిచికారీ చేసే అవకాశం ఉండటంతో రైతుల సమయం ఆదాతో పాటు, ఖర్చు కూడా తగ్గుతుంది.

80 శాతం సబ్సిడీ..వ్యవసాయ డ్రోన్లకు డిమాండ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌కేవీఎస్ పథకంలో పంపిణీ చేస్తున్న డ్రోన్ల కొనుగోలుకు రైతులకు 80 శాతం సబ్సిడీ అందిస్తున్నాయి. ఐదుగురు రైతులతో కూడిన ఒక గ్రూపును ఎంపిక చేసి ఆ గ్రూపులోని కన్వీనర్, కో-కన్వీనర్‌ల పేరుతో డీసీసీ బ్యాంకులో అకౌంటు తెరుస్తారు. వాస్తవంగా ఒక వ్యవసాయ డ్రోన్ ఖరీదు రూ.10 లక్షల వరకు ఉంటుంది. ఇందులో రైతుల గ్రూపు రూ.2 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ డబ్బులు కూడా డీసీసీ బ్యాంకు రుణం ఇస్తుంది. మిగిలిన రూ.8 లక్షల సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. జిల్లాలో ఒక్కో మండలం యూనిట్‌గా కేవలం 30 డ్రోన్లను మాత్రమే ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్నాయి. దీంతో ఈ వ్యవసాయ డ్రోన్లను పొందేందుకు రైతుల మధ్య డిమాండ్ పెరిగిపోతోంది.

గ్రామీణ యువతకు ఉపాధి

గ్రామాల్లో ఇంటర్ చదువుకున్న యువతీ, యువకులకు డ్రోన్ ఆపరేటింగ్ ద్వారా ఉపాధి అవకాశాలు వస్తాయి. వ్యవసాయ డ్రోన్ ఆపరేటింగ్ కోసం ఒక్కో మండలానికి ఒకరిని ఎంపిక చేస్తారు. వీరికి గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీలో 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ పదిరోజులు వీరికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు, ఇతర అలవెన్సులు కలిపి రూ.25 వేలు చెల్లిస్తారు. దీంతో పాటు డ్రోన్ ఆపరేటింగ్ లైసెన్సు కూడా మంజూరు చేస్తారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న పైలెట్‌లకు ఆయా మండలాల్లో రైతుల గ్రూపులకు మంజూరైన డ్రోన్ ఆపరేటింగ్ కోసం రెండేళ్ల అగ్రిమెంట్ చేసుకుంటారు. డ్రోన్ పొందిన రైతుల గ్రూపు ఆ మండలంలో డ్రోన్ అవసరమైన వారికి ఎకరాకు రూ.400 నుంచి రూ.600 చొప్పున అద్దె ప్రాతిపదికన అప్పగిస్తారు. ఒక్కో మండలంలో సీజన్‌ను బట్టి టమోటా, వంగ, మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలు సాగవుతాయి. ఈ క్రమంలో ఏడాది పొడవునా వ్యవసాయ డ్రోన్లతో మందులు, ఎరువుల పిచికారీ చేసే అవకాశాలు ఉంటాయి. దీంతో అటు రైతుల గ్రూపుకు, ఇటు పైలెట్‌కు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. శిక్షణ పొందిన పైలెట్లు పొలం చుట్టూ తిరిగి ఫీల్డ్‌మ్యాపింగ్ చేసి డ్రోన్ మానిటర్‌లో నమోదు చేస్తారు. దీంతో ఒక్కసారి పైకి ఎగిరిన డ్రోన్ ఖచ్చితత్వంతో పంటలకు, ప్రతి అడుగుకు, ప్రతి మొక్కకు మందులు, ఎరువులు పిచికారీ చేస్తాయి. పొలాల్లో అడ్డువచ్చే విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను గుర్తించి పక్కకు తొలగుతాయి. మరీ అడ్డు ఎక్కువగా ఉంటే తిరిగి పైలెట్ చెంతకు చేరిపోతాయి.

టమోటా సీజన్‌లో భలే గిరాకి

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో మార్చి నెల నుంచి టమోటా సీజన్ నడుస్తుంది. సుమారు 30 వేల హెక్టర్ల వరకు రైతులు టమోటా పండించనున్నారు. ఈ క్రమంలో టమోటా పంటలకు పురుగుమందులు, ఎరువులు పిచికారీ చేసేందుకు ఈ డ్రోన్ల ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. మండలానికి ఒక్కో డ్రోన్ మంజూరైనా నాలుగు నియోజకవర్గాల్లో 21 డ్రోన్లకు మంచి గిరాకీ ఉండనుంది.



టమోటా పంటకు గాలిలో నుంచే మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

పండగకూ పప్పులేదు..!

- ఈనెలలోనూ మొండిచేయి
- మూన్నాళ్ల ముచ్చటేనా..?
- కార్డుదారులకు చక్కెరతోనే సరి



మదనపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీతో ఇస్తున్న కందిపప్పు సరఫరాకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో మూడునెలలు పంపిణీ చేసింది. అయితే ఫిబ్రవరి నెలకు సరఫరా ఆగిపోయింది. దీంతో నెలవారీ రెగ్యులర్‌గా ఇచ్చే బియ్యంతో పాటు చక్కెరతో సరిపెట్టుకుంది. ఇదే నెలలో శివరాత్రి పండగ ఉండటంతో కందిపప్పు ఇవ్వకపోవడం ఏంటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇప్పటికే ఉన్న స్టాకు గోదాము నిండుకోవడం, పైనుంచి స్టేజ్-1 పాయింట్‌కు స్టాకు రాకపోవడంతో ఇక్కడి అధికారులు కూడా చేతులెత్తేశారు. ఇప్పటికే ఆయా గోదాముల్లో ఉన్న స్టాకును అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లకు సర్దుబాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా చౌకధరల దుకాణంలో కందిపప్పు రూ.67కు అమ్ముతుండగా రూ.160కి పైగా ఉంది. దీంతో కార్డుదారులు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,126 చౌకదుకాణాల పరిధిలో 4,98,092 రేషన్‌కార్డులు ఉన్నాయి. అయితే ప్రతినెలా కార్డులోని యూనిట్లతో సంబంధం లేకుండా కిలో కందిపప్పు, అరకిలో చక్కెర పంపిణీ చేస్తున్నారు. కానీ ఫిబ్రవరి నెలకు కూడా కార్డుకు కిలో చొప్పున 4,98,092 కేజీల కందిపప్పు అలాట్ చేయాల్సి ఉంది. కానీ గోదాముల్లో అందుబాటులో ఉన్న కందిపప్పును అంగన్‌వాడీలకు సరఫరా చేయగా, రెగ్యులర్ కార్డుదారులకు నిలిపేశారు. అయితే ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన నిత్యావసర వస్తువుల సరఫరా మంగళవారానికి బియ్యం, చక్కెరను ఎండీయూల ద్వారా 14,885 అంత్యోదయ కార్డులు, 1,54,429 తెల్లరేషన్ కార్డులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా పౌర సరఫరాల శాఖకు కందిపప్పు సరఫరా చేసే కాంట్రాక్టర్ గడువు ముగిసిపోయినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో తిరిగి కందిపప్పు సరఫరాకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించగా, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా కాంట్రాక్టర్ టెండర్ కోట్ చేయడంతో వాటిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ మధ్య ధర విషయంలో ఏకాభిప్రాయం కుదిరితే తప్ప కందిపప్పు వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా కందిపప్పు సరఫరా లేకపోవడంతో ఎండీయూ వాహనదారులు బియ్యం, చక్కెర పంపిణీకి ముందున్నంత ఆసక్తి చూపడం లేదు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

బస్సులో మరచిపోయిన రూ.1.50 లక్షల సొమ్ము ప్రయాణికుడికి అందజేత




చిన్నపరెడ్డికి డబ్బు అందజేస్తున్న డిపో మేనేజర్ రమణయ్య, కండక్టర్ మురళీధర్

రాజంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ఎస్.మురళీధర్ తన నిజాయితీని చాటుకున్నారు. బస్సులో ఓ ప్రయాణికుడు మరచిపోయి బస్సులో పెట్టి వెళ్లిపోయిన రూ.1.50 లక్షల సొమ్మును నిజాయితీగా తిరిగి ఆ ప్రయాణికుడికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో రాజంపేట నుంచి కడపకు వెళ్లే సర్వీసులో చిట్వేలికి చెందిన చిన్నపరెడ్డి అనే ఆటో డ్రైవర్ రూ.1.50 లక్షల సొమ్మును తీసుకెళ్లాడు. తాను పాత ఆటో అమ్మి వచ్చిన సొమ్ముతో కొత్త ఆటోను కొనేందుకు కడపకు ఆర్టీసీ బస్సులో వెళ్లాడు. బ్యాగులో పెట్టుకున్న ఆ నగదును పొరపాటున సీటుపై పెట్టి మరచిపోయి కిందకు దిగి వెళ్లిపోయాడు. ఇంతలో ప్రయాణికులందరూ దిగిపోయిన విషయాన్ని కండక్టర్ మురళీధర్ గమనిస్తుండగా ఓ సీటుపై బ్యాగు కనిపించింది. వెంటనే ఆ సొమ్మును తనవద్ద పెట్టుకుని వెనువెంటనే రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్యకు తెలియజేశారు. ఇంతలో కొత్త ఆటో కొనడానికి వెళ్లిన చిన్నపరెడ్డి షోరూం వద్దకు వెళ్లి డబ్బులు చూసుకోగా బస్సులో మరచిపోయిన విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన తాను వచ్చిన బస్సు కోసం వెనుదిరిగాడు. కడపలోని ఇతర ఆర్టీసీ కండక్టర్ల ద్వారా రాజంపేట ఆర్టీసీ డిపోకు తాను పోగొట్టుకున్న సొమ్ము విషయాన్ని తెలియజేశారు. డిపో మేనేజర్ రమణయ్య చిన్నపరెడ్డిని రాజంపేటకు పిలిపించి తమ తోటి సిబ్బంది సమక్షంలో చిన్నపరెడ్డికి కండక్టర్ మురళీధర్ ద్వారా తన చేతులమీదుగా ఆ మొత్తాన్ని అందజేశారు. దీంతో కండక్టర్ మురళీధర్‌ను అందరూ అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ కండక్టర్ మురళీధర్ నిజాయితీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మురళీధర్‌ను అభినందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- తుది దశకు చేరుకున్న ఉద్యాన క్రీడలు
- నేడు ముగియనున్న పోటీలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణంలో జరుగుతున్న అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం అలరించాయి. అలాగే వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, పరుగు పందెం, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హైజంప్ తదితర పోటీలు నిర్వహించారు. అన్ని క్రీడలు తుది దశకు చేరుకున్నాయి.



ఉద్యాన విద్యార్థులు గీసిన చిత్రం



భరత నాట్యం చేస్తున్న విద్యార్థిని

శుక్రవారం క్రీడలు అన్నీ ఫైనల్స్ ఆడే ప్రక్రియను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఉద్యాన విద్యార్థులు వివిధ రకాల పూలతో రంగవల్లులు వేశారు. అలాగే పాటలు, భరతనాట్యం తదితరవి ఆకట్టుకున్నాయి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి కె.గోపాల్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశామని తెలిపారు. కొన్ని క్రీడలు పూర్తి కావడంతో విద్యార్థులకు బహుమతులు అందజేశామని తెలిపారు. భోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడలేదన్నారు.



కబడ్డీ పోటీలో హోరాహోరీగా తలపడుతున్న అనంతరాజుపేట క్రీడాకారిణులు

విజేతలు వీరే

బ్యాడ్మింటన్ పోటీల్లో అనంతరాజుపేట బాలుర, బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలుర వాలీబాల్, బాలికల త్రోబాల్ విజేతగా నిలిచాయి. బాలికల హైజంప్‌లో ఎస్. లక్ష్మీహారిక (సీఎస్‌పురం), ఎల్.అనూషా (వీఆర్‌గూడెం), ఏ.లక్ష్మీ (పార్వతీపురం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

బాలుర డిస్కస్ త్రోలో రాహుల్ (వీఆర్‌గూడెం), శరత్‌చంద్ర (తాడిపత్రి), పృథ్వీరాజ్ (పార్వతీపురం), మొదటి మూడు స్థానాల్లో సాధించారు. 400 మీటర్ల బాలుర పరుగుపందెంలో సిద్ధార్థ, అనిల్‌కుమార్, (వీఆర్ గూడెం) సాగర్ (అనంతరాజుపేట), బాలికల విభాగంలో యమున, అనూషా (వీఆర్‌గూడెం), ఎం.సమీర (అనంతరాజుపేట) మొదటి మూడు స్థానాలు సాధించారు.

ముగ్గురు కూలీల అరెస్ట్

- ఆయుధాల స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రఘురాం

చిట్వేలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు కూలీలను గురువారం ఉదయం 7.30 గంటలకు కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు గొడ్డళ్లు, ఒక రంపం, 2 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘురాం తెలియజేశారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాల మేరకు సీఐ వెంకటేశ్వర్లు సూచనల మేరకు రాబడిన సమాచారంతో తాము సిబ్బందితో పోలీసు వాహనంలో వెళుతున్నామన్నారు. తమను చూసిన నిందితులు పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారించామన్నారు. తాము రైల్వేకోడూరు మండలం కొత్తపల్లె ఎస్టీ కాలనీకి చెందిన మద్దూరు చెంచుక్రిష్ణ(30), వద్దాలకోటి(25), మద్దూరు రమణయ్య(28), ఎస్‌వీఎస్ గిరిజన కాలనీలకు చెందిన వారుగా గుర్తించి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ రఘురాం తెలియజేశారు.

రేషన్‌షాపు ఆకస్మిక తనిఖీ



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రామాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు పంచాయతీ పక్కీరువల్లెలో 1137029 గల రేషన్‌షాపును గురువారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రేషన్ షాపులో ఉన్న బియ్యం, చక్కెర, కందిబేడలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే చౌకదుకాణ వస్తువులను రేషన్ లబ్ధిదారులకు అందించాలన్నారు. తూకాల్లో తక్కువ రాకుండా సక్రమంగా పంపిణీ చేసే విధంగా చూడాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రామాంజనేయులు, లక్కిరెడ్డిపల్లె ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌కు చేరుకున్న షరీఫ్

బి.కొత్తకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ సలహాదారు, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎంఏ షరీఫ్ గురువారం రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ కు చేరుకున్నారు. ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్సియల్ పాఠశాలల పరిశీలన లో భాగంగా గురువారం కడప జిల్లాలో పర్యటించిన షరీఫ్ విడిది కోసం హార్సిలీహిల్స్ కు చేరుకున్నారు. ప్రొటోకాల్ మేరకు అధికారులు స్వాగతం పలికి, బస ఏర్పాట్లు చేశారు.

సింహవాహనంపై శ్రీనివాసుడి వైభవం

- బ్రహ్మోత్సవాల్లో వేడుకగా వాహన సేవల ఊరేగింపు
- నేడు కల్పవృక్ష, హనుమంత వాహన సేవలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడోరోజైన గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి వారు ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి సింహవాహనంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. వేదపండితులు గురువారం వేకువనే స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. వాహన సేవల ముందు కోలాటలు, చెక్కభజనలు, భజన బృందాల కోలాహలం, భక్తుల గోవిందనామస్మరణలతో సాంస్కృతిక శోభ కనిపించింది. వాహన సేవ అనంతరం స్వామి వారికి ఆలయ మండపంలో పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్లు, చందనంతో కనుల పండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి సింహ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రికి హనుమంత వాహన సేవలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, వేదపండితులు కృష్ణ ప్రసాద్ భట్టర్, రమేష్ స్వామి, సిబ్బంది నగేష్, టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, సోము శేఖర్, ఆదిరెడ్డి, తరుగు శివారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



ముత్యపు పందిరివాహనంపై శ్రీవారు



సింహవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

దాహార్తి తీరేదెప్పుడో..!

● బోర్లు వేశారు.. బిల్లులు చేసుకున్నారు ● బోర్లలో చుక్కనీరు పడని వైనం
● రూ.3 కోట్ల నిధులు నీళ్లపాలు ● మంచినీటి కోసం పల్లె ప్రజల ఇక్కట్లు


జె.వడ్డెపల్లెలో మంచినీటి కోసం బిందెల క్యూ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడేళ్లుగా తీవ్ర వర్షాభావం నెలకొనడంతో మంచి నీటి పథకం బోర్లు ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొంది. దీంతో గత ఏడాది వైసీపీ ప్రభుత్వ హయంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.3కోట్లు జేజేఎం(జల్ జీవన్‌పథకం) పథకం కింద నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రతి గ్రామంలో 3, 4 మంచినీటి పథకం బోర్లు వేసి పైపులైను ద్వారా నీరు అందించినట్లు బిల్లులు మాత్రం చేసుకు న్నారు. అయితే ఏ గ్రామంలో చుక్కనీరు పడిన పాపాన పోలేదు. దీంతో చాలా గ్రామాల్లోని ప్రజలు మంచినీటి కోసం వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మండలంలోని పందిళ్లపల్లె, జె.వడ్డెపల్లె, దిన్నెపాడు వడ్డెపల్లె, బి.యర్రగుడి, కోనంపేట వడ్డెపల్లె, అనంతపురం హరిజనవాడ గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఈ గ్రామాలలో జేజేఎం నిధులతో 29 బోర్లు వేసినట్లు రూ.3 కోట్ల బిల్లులు చేసుకున్నారు. అయితే ఒక్క బోరులో కూడా చుక్క నీరు పడలేదని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇప్పటికీ పందిళ్లపల్లె జె.వడ్డెపల్లెలో తాగునీటి సమస్య తీరలేదు. గ్రామంలో సుమారు 130 కుటుంబాలు ఉన్నాయి. పాడి పశువులు, సూమారు 5వేలకు పైగా జీవాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు 10 మంచినీటి బోర్లు వేశారు. ఏ బోరులో కూడా చుక్కనీరు పడ లేదు. దీంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. తాగునీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం వెలుగల్లు ప్రాజెక్టు నుంచి కుడికాలువ ద్వారా నీరు అందించాలని మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. వెలుగల్లు ప్రాజెక్టు నీరు అందిస్తే పందిళ్లపల్లె, కుర్నూతల, కస్తూరి రాజుగారిపల్లె, మద్దిరేవుల, కోనంపేట, బి.ఎర్రగుడి, దిన్నెపాడు గ్రామాలలో బోర్లు నిండుకుండలా ఉంటాయని.. తాగునీరు సమస్య తీరుతుందని చెబుతున్నారు. ఆ దిశగా శాశ్వత పరిష్కారం చూపుతు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


బీఏ నాగిరెడ్డిపల్లెలో వ్యవసాయబోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు



బోర్ల వద్ద కాపలా ఉండి..



ఊరునిండా 10 బోర్లు వేశారు. ఒక్క బోరులో కూడా చుక్కనీరు పడలేదు. ఉన్న ఒక్క బోరులో వచ్చే చుక్కచుక్క నీటిని ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలా ఉండి తెచ్చుకుంటు న్నాం. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సక్రమంగా చేయడం లేదు. ఒక బజారుకే వదిలి వెళ్లిపోతున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది.

-వెంకటసుబ్బమ్మ, జె.వడ్డెపల్లె

పాచి నీళ్లు వస్తున్నాయి



మంచినీటి పథకం బోరు నుంచి పాచి నీళ్లు పచ్చగా వస్తున్నాయి. ఆ నీరు తాగడానికి సరిగా లేవు. వ్యవసాయ బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుం టాన్నాం. బోరును రీబోరు చేయించాలి. అధికారులు చర్యలు చేపట్టి రానున్న వేసవికాలంలో అయినా మంచినీరు అందించాలి.

-రమణమ్మ, జే.వడ్డెపల్లె

గుండెపోటుకు ఉచిత వైద్యం

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్


గుండెకు భరోసాపై అవగాహన పోస్టర్ విడుదల చేస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్టెమీ అనే గుండెపోటు వ్యాధికి రూ.45వేలు విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చి ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం జిల్లా ఆస్పత్రిలో గుండెపోటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆక స్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం లాంటి లక్షణాలన్నీ గుండె పోటుకు సంబంధించినవన్నారు. ఇలాంటి లక్షణాలు గమనించి మొదటి గంట అత్యంత కీలకమన్నారు. ఈలోపు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రికి గానీ తీసుకు వస్తే టెనెక్టెప్లెస్ ఇంక్షన్‌తో ప్రాణాలు కాపాడతారన్నారు. ఈ ఇంజెక్షన్ ప్రైవేటు ఆసుత్రుల్లో రూ.45 వేలు అవుతుందని అలాంటిది ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌టీఆర్‌వైద్య సేవల కింద బైపాస్‌సర్జరీ ఉచితంగా చేస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ఎన్ఎన్ఎంలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కర్నూలులో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయితల సంఘం 25వ రాష్ట్ర సాహిత్య పాఠశాల ఈ నెల 8,9 తేదీలలో కర్నూలులోని వెంకటాద్రిన గర్ వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు విరసం రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు పి.వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో విరసం రాష్ట్ర సాహిత్య పాఠశాల కరపత్రాలను ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ 1970లో ఆవిర్భవించిన విప్లవ రచయిత సంఘం ఎన్నో నిర్బంధాలను నిషేధాలను తట్టుకుని కవులు, రచయితలు ప్రజా పక్షం వుండాలనే ఒక ప్రజాస్వామిక సాంప్రదాయాన్ని నిలబెట్టిందన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సంక్షోభకాలంలో సాహిత్యకారుల పాత్రను చర్చించాల్సిన అవసరం వుందన్నారు. ప్రజల పక్షాన సాహిత్యకారులను నిలబెట్టాల్సిన సందర్భం అన్నారు. ఈ రెండు రోజులు సాహిత్య పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రచయితలు, కవులు, కళాకారులతో పాటు ఉద్యమ అభిమానులు, ప్రజాస్వామిక వాదులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తవ్వాసురేష్, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సుద్దపల్లె మురళి, రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యుడు సుబ్బయ్య ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దయగల తల్లి మరియతల్లి


మాట్లాడుతున్న ఫాదర్ వరప్రసాద్

కడప కల్చరల్ ఫిబ్రవరి 6, (ఆంధ్ర జ్యోతి) : విశ్వాసుల పట్ల దయగల తల్లి మరియతల్లి అని కడప పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఎం.వరప్రసాద్ కొనియాడారు. మరియాపురం లూర్థుమాత తిరుణాల మహోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి పాత చర్చి ఆవరణంలో జరిగిన నవదిన పూజా ప్రార్థనల్లో విశ్వాసులు భక్తిబావంతో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన విశ్వాసుల నుద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. పాపులను రక్షించేందుకే మరియతల్లికి యేసుప్రభువు మానవునిగా జన్మించారన్నారు. అంతకు ముందు విచారణ గురువు ఫాదర్ సిప్రియన్ దివ్యబలిపూజ గావించారు. తిరుణాల కమిటీ ప్రతినిధులు జ్యోతిరాయప్ప, బాలశౌరి, ప్రదీప్, ఆనంద్, ప్రసాద్‌తో పాటు విశ్వాసులు పాల్గొన్నారు.

సుభహాన్‌కు మెరుగైన వైద్యం అందించండి

● ట్విట్టర్‌లో స్పందించిన మంత్రులు లోకేశ్, మండిపల్లి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6: మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెలో నివాసం ఉంటున్న షేక్ సుభహాన్‌కు మతిస్థిమితం లేదు. ఇతని కాళ్లకు గాయాలయ్యాయి. గత ఐదేళ్లుగా బాధపడుతుండగా ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది చూసిన మంత్రులు లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు స్పందించారు. మండల టీడీపీ ఇన్‌చార్జ్ మదన్‌మోహన్‌కు ఫోన్ చేసి సుభహాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని, ఖర్చు ఎంతైనా తామే భరిస్తామని తెలిపారు. దీంతో వారు సుభహాన్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు తరలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్తార్ అహ్మద్, జెకె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నం (ఎంవీపీ కాలనీ), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పుఘర్ సమీపంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కడప జిల్లా బద్వేల్ మండలంలోని వెంకటశెట్టిపల్లి సమీపంలోని రాజుపాలానికి చెందిన వెలిగండ్ల కార్తీక్ రాజు (22) విజయనగరంలోని ఏవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం ఓ కంపెనీలో కోర్సు చేసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. కొద్ది రోజుల తర్వాత ఉద్యోగంలో జాయిన్ కావాలంటూ ఫోన్ కాల్ రావడంతో మైక్రోగ్రిడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో గత నెల 31న చేరాడు. అప్పటి నుంచి నగరంలోని శ్రీకృష్ణ పీజీ బాయ్స్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం ఉదయం నుంచి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ నిర్వాహకులు అతడు ఉంటున్న గది తలుపులు తెరచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. దీంతో వసతిగృహం నిర్వాహకులు ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా చక్రస్నానం... తరించిన భక్తజనం

● హంస వాహనంపై విహరించిన వీణాధరుడు ● ధ్వజావరోహణంతో ముగిసిన దేవుని కడప బ్రహ్మోత్సవాలు


పుష్కరిణిలో చక్రస్నానం ఆచరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు శ్రీలక్ష్మీవేకంటేశ్వరుడు వీణాధరుని అలంకారంలో హంస వాహనంపై మాడవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఊరేగింపు ముందు భాగాన చెక్కభజన, కోలాటం కళాకారులు లయబద్ధమైన నృత్యాలు భక్తులను అలరింపచేశారు. అంతకు ముందు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వసంతోత్సవం ఆనందకర వాతావరణంలో చేసు కున్నారు. 9 నుంచి 10-30 వరకు తిరుమలేసుడి చక్రత్తాళ్వార్‌ను ఆలయ అర్చకులు క్రిష్టమోహన్, త్రివిక్రమ్, క్రిష్ణమూర్తి, తరణ్, సాయిలు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ సమీప పుష్కరిణిలో ఉత్సవ మూర్తుల విగ్రహాలకు గంధాధి లేపనాలతో అవభృత చక్రస్నానం నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. చక్రస్నానానికి భక్తులు విశేషంగా హాజరై పుష్కరిణిలో అత్యంత భక్తిశ్రద్ధలతో స్నానమాచరించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా రాత్రి ధ్వజావరోహణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇరువురికి గాయాలు

సికెదిన్నె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ కుప్పాల జనార్ధన్, బైక్‌పై ఉన్న బత్తల సుబ్బయ్య అనే వ్యక్తులకు గాయాలు అయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు గురువారం ఉదయం కడప-రాయచోటి జాతీయ రహదారిలోని జమాల్‌పల్లి వద్ద ట్రాక్టర్ ఆగి ఉండగా పక్కనే బైక్‌పై మరో వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న సిమెంటు లారీ ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో డ్రైవర్ జనార్ధన్‌తో పాటు బైక్‌పై ఉన్న బట్టల సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

కారు ద్విచక్రవాహనం ఢీకొని...

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని శీలంవారిపల్లె వద్ద గురువారం సాయంత్రం కారు, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో పెంచలయ్య (చిన్న) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పెంచలయ్య బద్వేలు పట్టణంలో పెయింట్ పనికి వెళ్లి తిరిగి లక్ష్మీపాలెంలోని తన ఇంటికి ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. ఆ సమయంలో రహదారిపై గేదెలు అడ్డంగా రావటంతో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో పెంచలయ్యకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుల ప్రయోగానికి రూ.34లక్షలు మంజూరు

● ముగ్గురు అధ్యాపకుల ఎంపిక




అధ్యాపకులు అమరేంద్రకుమార్, మహబూబ్ జిలానీ, రమేష్

వేంపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో కొత్త పరిశోధనల కోసం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులకు మూడు ప్రాజెక్టులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రీయ ఉచిత శిక్షణ అభియాన్ ద్వారా మూడు కొత్త ప్రాజెక్టుల పరిశోధనల కోసం రూ.34లక్షలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఇ డుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రొఫెసర్ అమరేంద్రకుమార్, మహబూబ్ జిలాని, జి.రమేష్‌లు ఈ ప్రాజెక్టులకు ఎంపికయ్యారన్నారు. అధ్యాపకులు చేసే క్రొత్త పరిశోధనల వల్ల ఇంజనీరింగ్ విద్యార్థులకు, పరిశ్రమలకు మంచి ఫలితాలు లభిస్తాయని డైరెక్టర్ ఆకాంక్షించారు.

వైవీయూ అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ప్రొఫెసర్ చంద్ర ఓబుల్‌రెడ్డి


నియామకపత్రం అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైవీ యూనివర్సిటీ డీన్‌గా విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఆచార్యులు పి.చంద్ర ఓబుల్‌రెడ్డిని నియమించారు. గురువారం విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య చంద్రఓబుల్‌రెడ్డికి ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి కులసచివులు మరియు ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఇది వరకు ఈ స్థానంలో పనిచేసిన కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దాము పదవీకాల పూర్తికావడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ఆచార్య టి.చంద్రశేఖర్ పాల్గొన్నారని ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత పేర్కొన్నారు.

వెలుగు యానిమేటర్ల చేతివాటం

● రూ.కోట్లలో గ్రూపు సభ్యులకు టోకరా
● చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
● ఏడాదిగా లభించని యానిమేటర్ మల్లిక ఆచూకీ



ముద్దనూరు ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు యానిమేటర్లు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. మూడు సంవత్సరాల నుంచి యానిమేటర్లు గ్రూపు సభ్యులకు వేస్తున్న టోకరాలు ఒకొక్కటిగా ఆధారాలతో బయటపడుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో యానిమేటర్ల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

మండలంలో వెలుగు సంఘం గ్రూపులు దాదాపు 730 ఉండగా.. సభ్యులు దాదాపు 7982 మంది ఉన్నారు. 32 మంది యానిమేటర్లు ఉన్నారు. వీరిలో కొంత మంది యానిమేటర్లు గ్రూపు సభ్యులను మోసం చేస్తున్నారు. గతంలో ఉప్పలూరు గ్రామంలో ఇద్దరు (భార్యా భర్త) యానిమేటర్లు చేతివాటం ప్రదర్శించారు. శ్రీనిధి గ్రూపు సభ్యుల నుంచి దాదాపు రూ.60లక్షల దాకా టోకరా వేశారు. అయితే ఇద్దరు మృతి చెందడంతో ఈ వ్యవహారం అంతా భయటపడింది. అలాగే యామవరం గ్రామంలోని మరో యానిమేటర్ శ్రీనిధి గ్రూపు సభ్యులకు దాదాపు రూ.30లక్షలకు టోకరా వేశారు. అయితే ఏపీఎంపై ఆరోపణలు రావడంతో వారిని సస్పెండ్ చేశారు. యామవరం యానిమేటర్‌పై కేసు నమోదు చేసి సరిపెట్టుకున్నారు తప్ప డబ్బులు రికవరీ చేయలేకపోయారు. ముద్దనూరు టౌన్‌లోని మరో యానిమేటర్ మల్లిక దాదాపు రూ.50లక్షలు వీవో, గ్రూపు సభ్యుల నుంచి వసూళ్లు చేసి టోకరా వేసి పరారై ఏడాది కావస్తోంది. అయితే ఆ యానిమేటర్‌పై కనీసం కేసు కూడా పెట్టలేదు. వీవో డబ్బులు తమకు ఎటువంటి సంబంధం లేదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో యానిమేటర్లు టోకరా వేయడంతో జిల్లా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇప్పటికీ యానిమేటర్ మల్లికా ఆచూకీ లేకపోవడంతో విధుల నుంచి తొలగించి ఆ యానిమేటర్ స్థానంలో మరొకరిని పెట్టుకొన్నట్లు తెలిసింది. కాగా, యానిమేటర్ కుటుంబ సభ్యులు ముద్దనూరులో ఉన్నారు. యానిమేటర్ ఆచూకీ లేదు, ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, ఆయానిమేటర్‌ను ఏవిధంగా తొలగించి ఆమె స్థానంలో మరొకరికి ఉద్యోగం ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. గతంలో చేతివాటం ప్రదర్శించిన యానిమేటర్లపై నామమాత్రపు చర్యలు తీసుకోవడంతో అదే బాటలో మరికొందరు యానిమేటర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం



గతంలోనే అప్పటి ఇన్‌చార్జి ఏపీఎం ఇబ్రహీం పోలీస్‌స్టేషన్‌లో యానిమేటర్ మల్లికపై ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. తిరిగి రెండు రోజుల క్రితం వీవోకు సంబంధించి డబ్బులు యానిమేటర్ మల్లిక వాడుకున్నారని వీవో అధ్యక్షురాలు, సీసీలు వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పీడీ వద్ద లెటర్ తీసుకురావాలని పోలీసులు తెలిపారు. అందుకే పీడీకి లెటర్ పెడుతున్నాం.యానిమేటర్ మల్లిక స్థానంలో మరొకరిని చేర్చుకోవడం జరిగింది. మండలంలో ఇద్దరు యానిమేటర్లకు 60 ఏళ్లు పైబడటంతో వారి స్థానంలో కూడా వేరేవారిని సమావేశంలో తీర్మానం చేసి చేర్చుకున్నాం.

-అపర్ణదేవి, ఏపీఎం,ముద్దనూరు

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నిరీక్షణ

● వైసీపీ పాపం.. రైతులకు శాపం ● నాయకుల ఇళ్ల వద్ద నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ● కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూముల్లో బోర్లు వేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఏళ్లతరబడి నిరీక్షణ చేస్తున్నారు. కొందరు రైతులు డీడీలు కట్టిన ట్రాన్స్‌ఫార్మర్లు పంటలసాగు కోసం నానా పాట్లు పడుతున్నారు. రైతులపై పగబట్టిన గత వైసీపీ ప్రభుత్వం నిజమైన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయకుండా కొంత మంది వైసీపీ నాయకులకు మాత్రం మంజూరు చేయడం వాటిని వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద, రచ్చ బండల వద్ద దిష్టిబొమ్మల్లా నిరుపయోగంగా పడిఉన్నాయి. అయితే వాస్తవంగా బోర్లు వేసి డీడీలు కట్టి ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్న రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.పీటీఎం మండలంలో గత ఐదేళ్ల టీడీపీ సానుభూతి పరులపై కక్ష సాధింపులు జరిగాయి. దీంతో సాధారణ రైతులు డీడీలు కట్టినా బోర్లు వేసినా ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రం ఇప్పటికి మంజూరు కాలేదు. ఆ రైతులు ఇప్పటికి విద్యుత్ సర్వీసులు లేక పంటలు పెట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. ఇంకొక వైపు కొంత మంది వైసీపీ మద్దతుదారులు పొలాల్లో బోర్లు వేయకున్నా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించుకుని వాటిని నిరుపయోగంగా దిష్టిబొమ్మల్లా పెట్టుకోవడం విడ్డూరంగా ఉంది. వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ అధికారులు స్వాధీనం చేసుకుని అర్హులైన రైతులకు అందచేస్తే సమస్యలు తీరుతాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో కొంతమంది రైతులు విద్యుత్ సర్వీసు కోసం గత ఐదు సంవత్సరాలుగా వేచి ఉండడం గమనార్హం. గత ఆరు నెలల క్రితం మండలంలోని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లె తాగునీటి బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని ఆ గ్రామస్థులు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించిన ఇంత వరకు అధికారులు పట్టించుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. మండలంలోని కుమ్మరవారిపల్లెకు చెందిన ఓ రైతు తనకున్న 372 సర్వీసు నంబర్‌కు కరెంట్ చార్జీ మినిమం బిల్లు కడుతున్నా ఆ రైతుకు 15 సంవత్సరాలు అయినా ఇంత వరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకపోవడం కొసమెరుపు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైతుల గోడును దృష్టిలో ఉంచుకుని అర్హులైన రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అందే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.


ఓ పార్టీ నేత ఇంటి వద్ద నిరుపయోగంగా పడిఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు



సంపతికోట గ్రామానికి చెందిన ఓ రైతు ఐదేళ్ల క్రితం కట్టిన డీడీ రసీదు


కొత్తసుబ్బరాయునిపల్లె వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కోసం సిద్ధం చేసుకున్న సిమెంట్ దిమ్మె

ట్రాన్స్‌ఫార్మర్లు రాగానే సమస్య తీర్చుతాం

సుమారు 500 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందచేయాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయి, అవి రాగానే రైతులకు అందిస్తాం. విద్యుత్ మెటీరియల్ కూడా తగినన్ని రావాల్సి ఉంది, అన్నీ మంజూరుకాగానే రైతులకు అందిస్తాం. గత 2019 నుంచి ఇంత వరకు మండలంలోని సూమారు 800 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందించాం.

- రామలక్ష్మయ్య, ట్రాన్స్‌కో ఏఈ, పీటీఎం

తపాలా ఉద్యోగి మిస్సింగ్ కేసు నమోదు


హర్షిత

నిమ్మనపల్లి ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంవారిపల్లి పోస్టాఫీస్‌లో ఏబీపీఎమ్‌గా పని చేస్తున్న టి.హర్షిత(21) తప్పిపోయినట్లు తండ్రి హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం పోలీసులు మాట్లాడుతూ కుప్పన్నగారిపల్లి చిత్తూరు జిల్లాకు చెందిన హర్షితకు 2003లో తపాలా ఉద్యోగిగా ఏబీపీఎమ్ ఉద్యోగం వచ్చిందన్నారు. ఆ మేరకు నిమ్మనపల్లిలోని వెంగంవారిపల్లిలో విధులు నిర్వర్తించేవారని తెలిపారు. బుధవారం రాత్రి 10గంటల సమయంలో తన స్కూటీపై వెళ్లి మరళా తిరిగి రాలేదని తెలిపారు. ఫోన్ చేస్తే సిచ్ ఆఫ్ అని వస్తుందని తెలిపారు. తన కుమార్తె హర్షిత ఆచూకీ కనుగొనాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దతిప్పసముద్రం ఎస్ఐగా హరిహర ప్రసాద్



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలానికి నూతన ఎస్ఐగా హరిహర ప్రసాద్ గురువారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ రామసముద్రం మండలానికి బదిలీ కాగా మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న హరిహర ప్రసాద్‌ను పెద్దతిప్పసముద్రం మండలానికి బదిలీ చేశారు. దీంతో ఆయన గురువారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ హరిహర ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తన వంతు కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. బాధితులు సమాచారం మేరకు ములకల చెరువుకు చెందిన శివశంకర్(40), కృష్ణారెడ్డి (60)లు ద్విచక్ర వాహనంపై గట్టురోడ్డులో ఆకులవారిపల్లె వద్ద అదుపుతప్పి కిందపడ్డారు. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు వారికి చికిత్స అందించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

మదనపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ చౌకదుకాణాలను స్థానిక సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్ తనిఖీ చేశారు. ఇందులోభాగంగా గురువారం పట్టణంలోని 15, 16, 20, 21, 22, తదితర షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి నెలకు సంబంధించి గోదాము నుంచి రేషన్‌షాపునకు వచ్చిన స్టాకు, ఎండీయూలకు జారీ చేసిన స్టాకు వివరాలతో కూడిన రికార్డులు, ఆథరైజేషన్ వివరాలను రేషన్‌డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ఇందులో రేషన్ డీలర్లు ఇమాం ఖాసీం సాహెబ్, కృష్ణమూర్తి, మురళి, తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

వాల్మీకిపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో 75మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే 28మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.1.63 లక్షలు ఆదాయం

నిమ్మనపల్లి ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిరాచవేటివారిపల్లి గ్రామ పంచాయతిలోని చెరువుల వేలంద్వారా రూ.లకా 63వేలు ఆదాయం చేకూరినట్లు ఈవో పీఆర్‌డీ చలపతిరావు తెలిపా రు. గురువారం స్థానిక పంచా యతి కార్యాలయంలో గ్రామ పంచాయతిలోని 14చెరువులలో చేపలు పట్టుకొనేందుకు 6నెలల కాల వ్యవధితో వేలం నిర్వహించారు. వేలం పాటలో అధికంగా పెద్దచెరువు 43వేలకు మహేష్ అనే రైతు దక్కించు కోగా మిగిలిన చెరువులు ఎక్కువగా పాటదారులు దక్కించుకొన్నారు. వచ్చిన ఆదాయాన్ని పంచాయతి అభివృద్ధికి వినియెగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మారెప్ప, సర్పంచ్ మధు, ప్రజలు పాల్గొన్నారు.

రిజర్వాయర్ వద్ద ఇసుక తోడితే కఠిన చర్యలు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని భోగంపల్లె వద్ద ఉన్న రిజర్వాయర్ ప్రాంతంలో తాగునీటి బోరుబావుల వద్ద ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వాల్మీకిపురం గ్రామ పంచాయతీ ఈవో రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం పట్టణ దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన రిజర్వాయర్ ప్రాంతంలో తాగునీటి బావులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తోడుతున్న వ్యక్తులను హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఇకపై ఇసుక తవ్వితే ఎంతటి వారైనా ఉపేక్షించక కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ సిబ్బంది నిఘాతో ఇసుక తవ్వకాలను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మృతిపై అనుమానాస్పద కేసు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 6: తట్టివారిపల్లె చెరువులో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటనపై అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పెద్దమండ్యెం మండలం వడ్డివంక తాండాకు చెందిన బుక్కే నాగేశ్వరనాయక్(45) గత నెల 28వ తేదీ నుంచి కనపడకుండా పోతే భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు మదనపల్లె టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఈ నెల 3వ తేదీన అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా తట్టివారిపల్లె చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు బుధవారం టూటౌన్, తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం చెరువులోఉండటం, చీకటి పడడంతో ఇటు పోలీసు స్టేషన్ అధికారులు మా పరిధిలోకి రాదంటూ మిన్నకుండిపోయారు. గురువారం జిల్లా అధికారులు ఆదేశించడంతో మదనపల్లె టూటౌన్ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహన్ని వెలికితీశారు. అప్పటికే మృతదేహం ఉబ్బిపోయి ఉండడంతో జేబులోని లైసెన్స్ ఆధారంగా వారి కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే పోస్టుమాస్టం నిమిత్యం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్

ములకలచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ పిలుపు నిచ్చారు. ములకలచెరువులో గురువారం జరిగిన తంబళ్లపల్లె నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి కృషి చేసే పార్టీ బీఎస్పీనన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు యుగంధర్, ఇన్‌చార్జి బాలాజీ, నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కలకడలో పర్యటించిన టీడీపీ నేతలు



కలకడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):టీడీపీ సినీయర్ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమార్తె నిశ్చితార్థానికి గురువారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులు హర్షణి, రామకృష్ణలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ రాందాస్ చౌదరి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, నాయకులు కంభం నిరంజన్‌రెడ్డి, రైస్‌మిల్ రమణ, ఇంజేటి తారకేశ్వర, వాటర్‌షెడ్ రవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

హైదరాబాదు వ్యక్తి మదనపల్లెలో మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో హైదరాబాదుకు చెందిన దీపక్‌సింగ్(33) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మదనపల్లె టూటౌన్ పోలీసుల వివరాల మేరకు హైదరాబాదు, ఎల్ఎస్ నగర్, జియాగూడ చెందిన దీపక్‌సింగ్(33) కొంతకాలంగా మదనపల్లె పట్టణం, గొల్లపల్లె రింగ్‌రోడ్డు వద్ద టీ హోటల్‌లో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతను అదే హోటల్లో పని చేస్తున్న సురేష్ తో కలిసి ఒకే గదిలో అద్దెకు ఉన్నారు. గురువారం టీ హోటల్‌లో పనికి ఎంత సమయానికి రాకపోవడంతో యజమాని వెళ్లి చూడగా అప్పటికే చనిపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ రామచంద్ర, ఎస్ఐ రహంతుల్లా వచ్చి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉర్దూ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయండి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌కు పర్వీన్‌తాజ్ వినతి


ప్రభుత్వ సలహాదారు షరీఫ్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లతో పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి):తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ విద్యార్థుల కోసం ఉర్దూ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీవెల్ఫేర్ సలహాదారు, మాజీ శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్ ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్ కోరారు. రాయలసీమలోని ప్రభుత్వ ఉర్దూ ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా కడప జిల్లా వేంపల్లెకు వచ్చిన షరీఫ్‌ను పర్వీన్‌తాజ్ కలిశారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజీ విషయమై మాట్లాడినట్లు ఆమె తెలిపారు. తంబళ్లప ల్లెలో 30వేలకు పైగా ముస్లిం మైనారిటీ పిల్లలు ఉన్నట్లు షరీఫ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె పేర్కొన్నారు. కాగా ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించారని. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తో ఈ విషయమై చర్చించినట్లు ఆమె తెలిపారు.

ఆటోనగర్ ఏర్పాటుకు పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న ఆటో ఎలక్ట్రీషియన్స్ అధ్యక్షుడు జాఫర్

మదనపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు తామంతా కలిసికట్టుగా పోరాటం చేస్తామని స్థానిక ఆటో ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాఫర్ తెలిపారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం కమిటీ ఎన్నిక, సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆటో మొబైల్ రంగంలో మదనపల్లె రెండోస్థానంలో నిలిచిందన్నారు. అయితే ఇంత వరకూ ఆటోనగర్ లేకపోవడంతో వేల రూపాయలు బాడుగలు కట్టలేక అనేక మంది యజమాలను కూలీలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదంలో గాయపడి దివ్యాంగులు అయినా, మృతి చెందినా ఆ కుటుంబం వీధిన పడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీ కింద రుణాలు మంజూరు చేసి తమను ఆదుకోవాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కళంధర్, కోశాధికారి వాసు, ఉపాధ్యక్షుడు మస్తాన్, సభ్యులు పాల్గొన్నారు.

గోళ్లపల్లె హైస్కూల్‌లో సామాజిక తనిఖీ

బి.కొత్తకోట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లె జడ్పీ హైస్కూల్‌లో గురువారం సామాజిక తనిఖీ జరిగింది. స్టేట్ రీసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలోని కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్, ఓ జడ్పీ హైస్కూల్‌లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట మండలంలో గోళ్లపల్లె హైస్కూల్‌ను ఎంచుకున్నారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థులతో వారి ప్రవర్తన, బాలికలకు శానిటేషన్ సౌకర్యాలు తదితర అంశాలపై విచారణ చేస్తున్నామని, శుక్రవారం జరిగే తల్లితండ్రుల సమావేశంలో విచారణలో తేలిన అంశాలను బహిర్గతం చేస్తామని వారు పేర్కొన్నారు. కాగా కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ జరగనున్నట్లు తనిఖీ బృందం వెల్లడించింది.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు ప్రయాణం చేసే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ లోకేష్‌రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఎస్ఐ సిబ్బందితో కలిసి తంబళ్లపల్లె-ములకలచెరువు రహదారిలో ఏటిగడ్డపల్లెకు సమీపంలో వాహనాల తనీఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని, ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం తాగి వాహనం నడపడం చట్టవ్యతిరేకమని నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించండి


పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశమై మాట్లాడుతున్న ఏఎస్ఐ

పెద్దమండ్యం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని పెద్దమం డ్యం ఏఎస్ఐ హేమసుందరం పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని గ్రామ సచివాలయ మహిళా పోలీ సులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో శాంతిభద్రతలు నెలకొల్పడానికి చిన్న చిన్న గొడవలు పెద్దవి కాకుండ పరిష్కారించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీ మైనారిటీ సెక్రటరీ పదవికి అలీఖాన్ రాజీనామా



పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెక్రటరీగా ఉన్న దండు రియా సత్ అలీఖాన్ తన క్రీయాశీల సభ్యత్వానికి, పదవికి గురువారం రాజీనామా చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కోసం కష్టపడ్డ ఆయనకు వైసీపీలో సరైన గుర్తింపు లభించకపోవడంతో అసమ్మతిగా ఉన్న ఆయన ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఆ మేరకు తన రాజీనామా పత్రాన్ని వైసీపీ కేంద్ర కార్యాలయానికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి


మండల సమావేశంలో అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ ఇ.రెడ్డెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నిరోజులకు తాగునీటి సరఫరా చేస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందువలన నీటి సమస్య ఉత్పన్నమయ్యే గ్రామాలను గుర్తించి బోర్లను లోతు తవ్వడం, కొత్తబోర్లు అవసరమయ్యే ప్రాంతాలను గుర్తించాలన్నారు. కొన్ని గ్రామాల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోందని, పంచాయతీ కార్యదర్శులు వారంలో నాలుగు రోజులు ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలన్నారు. బసినికొండ పంచాయతీ పరిధిలోని స్వామిచెరువు, సీటీఎం పరిధిలోని పెద్దచెరువు రెండున్నర ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని దీనిపై జలవనరులశాఖ, రెవెన్యూశాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించి, ఆక్రమణలు తేలితే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువైద్య, ప్రజల వైద్యం వారి ఇళ్ల వద్దకే అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరుకాకపోవడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు.

వారపు సంతలా సర్వసభ్య సమావేశం

మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు చర్చిస్తారు. దీనికి సంబంధిత అధికారులు సమాధానం ఇవ్వడం సాధారణంగా ఉంటుంది. కాని గురువారం ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వారపు సంతలా మారింది. అనధికారులు, ప్రజలు, రాజకీయ నాయకులు సమావేశం హాలులోకి యథేచ్ఛగా రావడం, కూర్చోవడం వెళ్లిపోవడం జరుగుతూనే వుంది. దీంతో సర్వసభ్య సమావేశానికి పలుమార్లు అంతరాయమేర్పడింది. వాస్తవంగా సమావేశం హాలు బయట ఒక అటెండర్‌ను పెట్టి కేవలం సభ్యులు, అధికారులు, మీడియాను మాత్రమే అనుమతించి ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని పలువురు ఎంపీటీసీలు వాపోయారు. ఇక మీదట ఎలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డెమ్మ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, వైస్ఎంపీపీలు రమణ, నందిని, వెలుగుచంద్ర, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం వీడండి


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల కల్పనలో నిర్లక్ష్యం వీడాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సూచించారు. స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయకుంటే చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీల సంఖ్య తగ్గిపోయిందని కూలీల సంఖ్య పెంచి పనులు విరివిగా కల్పించాలన్నారు. బాగా పనిచేసి ఉపాధి హామీ పథకంలో జిల్లాలో ముందుండేలా పనులు కల్పించాలన్నారు. ఎవ్వరూ వలసలు వెళ్లకుండా నివారించాలన్నారు. సమావేశంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీడీవో హరినారాయణ, ఆరు మండలాల ఏపీవోలు, ఉపాధి ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్‌కే జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు 2019లో ఒక్క ఛాన్స్ ఇస్తేనే అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, అన్ని విధాల వనరులను దోపిడీ చేసి భ్రష్టు పట్టించారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ దుయ్యబట్టారు. గురువారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడుతూ తాడేపల్లె వైసీపీ సమావేశంలో తనలో 2.0 జగన్‌ను చూస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్ల అవకాశం ఇస్తే రాష్ట్రంలోని పోలవరం, అమరావతి, విశాఖ రైల్వేజోన్, విశాఖ స్టీల్‌ప్లాంటు అంశాలను పక్కన పెట్టేసి స్వార్థం కోసం పాలన చేశారన్నారు. సర్వం కోల్పోయిన రాష్ట్రాన్ని నేడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చక్కదిద్దుతున్నారన్నారు. ఎన్నికల హామీలో సూపర్‌సిక్స్ పథకాల అమలు కృషి చేస్తున్నారన్నారు. మదనపల్లె అభివృద్ధికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కృషి చేస్తుంటే, వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ ప్రేలాపణలు చేస్తున్నారని విమర్శించారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందించండి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతుల సందర్భంగా వారికి అల్పాహారం, స్నాక్స్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరారు. గురువారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలసిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ పట్టణంలో టెన్త్ విద్యార్థులకు ఉదయం8 నుంచి 9గంటల వరకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం తరపున మున్సిపల్‌శాఖ ద్వారా అల్పాహారం, స్నాక్స్ అందించే నిబంధనలు ఉన్నాయని గుర్తు చేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగోపాల్, ఉపాధ్యాయులు రాజేంద్రబాబు, పురం వెంకటరమణ, మహ్మద్‌ఖాన్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేల మల్లయ్యస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయండి


నేలమల్లయ్య ఆలయం వద్ద సమావేశమైన అధికారులు, కమిటీ సభ్యులు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) మండలంలోని శివపురం గ్రామ పరిధిలోని నేలమల్లయ్య స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆలయ చైర్మన్ కృష్ణమూర్తి కోరారు. గురువారం నేల మల్లయ్య స్వామి ఆలయం వద్ద అయల కమిటీ వారు శివరాత్రి ఉత్సవాలపై సమావేశం నిర్వహిచి వారు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా కాలి నడకన తంబళ్లపల్లి మల్లయ్యకొండకు వెళ్లే భక్తుల కోసం తాగునీటి బోరు మంజూరు చేయాలని భక్తులు కోరారు. అక్షయ అన్నదానం ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మల్లయ్య శివరాత్రికి భక్తులకు అన్నదాన జరుగునున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆశోక్, పంచాయతీ కార్యదర్శి శైలజ, గీత మందిరం స్వామి, కమిటీ సభ్యులు ఆనంద, రామాంజులునాయుడు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై మంత్రి ప్రకటన హర్షణీయం

మదనపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్ధరాత్రి 12 గంటల వరకు హోటళ్లు తెరుచుకునే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించడంపై టీడీపీ సీనియర్ నాయకుడు, తాజ్‌హోటల్స్ యజమాని పఠాన్ ఖాదర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో రెండురోజుల పాటు జరిగిన హోటల్స్ అసోసియేషన్(ఏపీహెచ్ఏ) కార్యనిర్వాహక కమిటీ సమాశంలో ఈ మేరకు హామీ ఇచ్చారని, గుర్తుచేశారు. హోటల్ రంగానికి ఊతమిస్తూ మంత్రి కీలక ప్రకటన చేయడంతో హోటల్స్ యజమానుల్లో మరింత ఉత్తేజమొచ్చిందన్నారు. ప్రభుత్వం కూడా ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, పర్యాటక అభివృద్ధికి, హోటళ్ల రంగానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు పరిశ్రమలు తీసుకొచ్చి హోటళ్లకు విద్యుత్తు, ఇతర రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తామని ప్రకటించారని పఠాన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకుగాను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారుడు యూసుఫ్‌కు సన్మానం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలో జరిగిన షూటింగ్‌బాల్ టోర్నమెంట్‌లో మనదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన జిల్లా వాసి యూసుఫ్‌ను గురువారం వాల్మీకిపురంలో ముస్లిం యువత ఘనస్వాగతం పలుకుతూ సన్మానించారు. ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో తలపడి జట్టును గెలిపించడంతో పాటు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పథకం సాధించిన యూసుఫ్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, ఎస్ఐ శ్రీహరి, కువైట్ సయ్యద్‌బాషా, ఇమ్రాన్, డిష్ బ్రదర్స్ పీర్‌బాషా, బాబా, కలందర్, మున్వర్, షాహిద్, జాకీర్, ఇర్ఫాన్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.